INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

సోమవారం 12.08.2024
INK OF TRUTH
# జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
సంపుటి - 32 | సంచిక -176 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00

## తుంగభద్ర డ్యాం గేటు సంఘటనపై ముఖ్యమంత్రి సమీక్ష

● జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోయిన సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి సెంట్రల్ డిజైన్ కమిషనర్ తో పాటు ఇంజనీరింగ్ డిజైన్స్ బృందాన్ని కూడా ఏర్పాటు చేసి ఘటన ప్రదేశానికి పంపించడం జరిగిందని ఆయన వివరించారు.

డ్యాం గేటు కొట్టుకుపోయిన కారణంగా ప్రజలకు అప్రమత్తత అవసరం ఉండడంతో, జిల్లా కలెక్టర్ కు ఈ విషయంపై తగిన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి చెప్పారు. కౌతాలం, కోసిగి, మంత్రాలయం, నందవరం మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల అధికారులను కూడా అప్రమత్తంగా ఉండాలని మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు.

## మదనపల్లె ఫైల్స్ ను మించిన ఘోరాలు.. 15 నుంచి వెలుగులోకి

● టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి



అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) : ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రాష్ట్ర ప్రజలు మరో స్వాతంత్ర్యం వచ్చిందన్న సంతోషంలో ఉన్నారని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ప్యాలెస్ నుంచి పాలన ప్రజల ముందుకు చేరుతోందన్నారు. చేతులు మారిన భూముల మీద విచారణ సాగుతోందని, ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ల బంద్ పాటు ల్యాండ్ మాఫియాకు పెద్ద షాక్ తగిలిందని తెలిపారు. మదనపల్లె ఫైల్స్ను మించిన సర్వేపల్లి కోర్టు చోరీ ఫైల్స్ వంటి ఘోరాలున్నాయని చెప్పారు. ఇలాంటివన్నీ ఈ నెల 15వ తేదీ నుంచి మొదలయ్యే 'ప్రజల వద్దకు పాలన' సదస్సులతో వెలుగులోకి రానున్నాయని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నిర్ణయాలతో పాప ప్రక్షాళన జరగబోతుందని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.

## జగన్ .. నిర్లక్ష్య పాలనతో అన్నదాతల ఆత్మహత్యలు

● మంత్రి అచ్చెన్నాయుడు




అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) : వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ పాలనలోని లోపాలను ఎత్తు చూపుతూ సెటైర్లు వేశారు. ఆదివారం నాడు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో జగన్ పాలనను విమర్శిస్తూ మంత్రి అచ్చెన్నాయుడు పోస్ట్ చేశారు. 'అసమర్థ పాలనా విధానాలతో అన్నదాతలను ఆత్మహత్యల వైపు పురికొల్పిన నిర్లక్ష్య పాలన నీది జగన్.. అదే అన్నదాతలకు ఆపన్నహస్తం అందిస్తూ విత్తనం నుంచి మార్కెట్ వరకు ప్రతీ సమస్యకు పరిష్కారం చూపే చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం మాది. ' బోత్ ఆర్ నాట్ సేమ్' అంటూ బాలయ్య సినిమాలోని పంచ్‌ను వేశారు.

'రాష్ట్ర చరిత్రలోనే నీ పరిపాలనలో రైతులకు చీకటి రోజులు. సిద్ధం ఫ్లెక్సీలు మీద చూపించిన శ్రద్ధ ఏనాడైనా రైతుల మీద చూపించావా జగన్. రైతులకు పథకాలు నిలిపేసి.. నీ దిష్టిబొమ్మ వేసిన పాస్ పుస్తకాలు, సమాధి రాళ్ల లాంటి సర్వే రాళ్లు పంపించావు. కేవలం ఖరీఫ్‌లో మాత్రమే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి, రబీకి ఏ నాడూ ఒక్క రూపాయి ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించకుండా రైతులను నట్టేట ముంచిన నీచమైన చరిత్ర నీది జగన్. అసమర్థ, అరాచక పరిపాలనలో, అసత్య ఆరోపణల్లో నువ్వు ఒక వర్గానికి ఆదర్శం. అధికారంలో ఉన్నప్పుడు పరదాలు అడ్డు పెట్టుకొని పోలీసు బలగాల మధ్య తిరిగిన నువ్వు ఒక్కసారైనా రైతుల మధ్యకు వెళ్లి ఉంటే ఖచ్చితంగా నీకు దేహ

2 లో

# అమెరికాకు తలవంచలేకే రాజీనామా !

● బంగ్లా అల్లర్ల వెనుక అమెరికా

● తొలిసారి మాజీ ప్రధాని హసీనా సంచలన వ్యాఖ్యలు



పొలిటికల్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ) : బంగ్లాదేశ్ లో ఇటీవల జరిగిన తిరుగుబాటు, అల్లర్ల వెనుక అమెరికా హస్తం ఉందని ఆ దేశ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత షేక్ హసీనా ఆరోపించారు. ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ ఆమె ఈ ఆరోపణలు చేశారు. "నేను మృతదేహాల ఊరేగింపును చూడాలనుకోలేదు. వారు విద్యార్థుల శవాలపై అధికారాన్ని హస్తగతం చేసుకోవాలనుకొన్నారు. దానిని అంగీకరించలేదు. ప్రధాని పదవికి రాజీనామా చేశాను"

"ఒక వేళ నేను సెయింటు మార్టిన్ ద్వీపంపై సార్వభౌమత్వాన్ని అప్పగించి.. అమెరికాకు బంగాళాఖాతంలో పట్టు కల్పిస్తే పదవిలో కొనసాగేదాన్ని. దయ చేసి అతివాదుల మాయలోపడొద్దని నేను నా దేశ ప్రజలను కోరుతున్నాను" అని ఓ ఆంగ్ల పత్రికకు పంపిన సందేశంలో పేర్కొన్నారు.

చాలా మంది నాయకులు, కార్యకర్తలు హత్యకు గురైన విషయం తెలిసి ఆవేదన చెందినట్లు హసీనా తెలిపారు. పలువురు పార్టీ సభ్యుల ఇళ్లను ధ్వంసం చేశారన్నారు. భగవంతుని దయవల్ల త్వరలోనే తిరిగి వెళతానన్నారు. అవామీ లీగ్ మరోసారి నిలబడుతుందని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ క్షేమం కోసం ఎప్పుడూ భగవంతుడిని ప్రార్థిస్తానని తెలిపారు.

ఆగస్టు 5వ తేదీ నుంచి బంగ్లాదేశ్ లో తీవ్ర స్థాయిలో అల్లర్లు జరుగుతున్నాయి. గత వారం తీవ్రం కావడంతో ప్రధాని షేక్ హసీనా పదవికి రాజీనామా చేసి భారత్కు వచ్చేశారు. ప్రస్తుతం ఆమె ఇక్కడే ఉంటున్నారు. యూకేలో ఆశ్రయం కోసం చేసుకొన్న దరఖాస్తును ఆదేశం తిరస్కరించింది. ఈ ఏడాది మే నెలలో హసీనా ఓ కీలక ప్రకటన చేశారు. బంగ్లాదేశ్లో వైమానిక స్థావరం ఏర్పాటుచేసుకోవడానికి ఒక దేశానికి అనుమతిస్తే.. తన ఎన్నిక సాఫీగా జరిగేటట్లు చేస్తానని ఆఫరిచ్చిందన్నది దాని సారాంశం. ఈ ప్రకటన ఒక్కసారిగా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అమెరికానే ఆ దేశం అయి ఉంటుందనే ప్రచారం జరిగింది. "ఒక దేశానికి బంగ్లాదేశ్లో వైమానిక స్థావరం ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తే నాకు ఏ సమస్యా ఉండేది కాదు. ఇది చూడటానికి ఒక దేశాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకొన్నట్లు కనిపిస్తుంది. కానీ, వారి లక్ష్యం అదికాదు.. ఎక్కడికి వెళుతుందో నాకు తెలుసు. మరిన్ని సమస్యలు ఎదురుకావచ్చు. ఆందోళన చెందకండి. నేను జాతిపిత బంగబంధు షేక్ ముజిబుర్ రెహ్మాన్ కుమార్తెనని వారికి చాలా స్పష్టంగా చెప్పాను. మా స్వాతంత్ర్య పోరాటాన్ని మేము గెలిచామని స్పష్టంగా చెప్పాను. నా దేశాన్ని ఎవరికో అద్దెకు ఇచ్చో.. అప్పగించో అధికారంలోకి రావాలని నేను కోరుకోవడం లేదన్నాను. ఈస్ట్ తైమూర్ వలే వారు ఇక్కడ కూడా బంగ్లాదేశ్లోని చోటోగ్రామ్, మయన్మార్లోని కొంత భాగాన్ని విడగొట్టి కొత్త దేశం ఏర్పాటుచేస్తారు. బంగాళాఖాతంలో ఒక స్థావరాన్ని ఏర్పాటుచేసుకొంటారు" అని నాడు హసీనా పేర్కొన్నారు. నాటి నుంచి హసీనా ప్రభుత్వం ఎక్కువ రోజులు అధికారంలో ఉండదనే ప్రచారం మొదలైంది.

## చంద్రబాబు, పవన్ , ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు నాకేం కాదు



ఏలూరు ( జర్నలిస్ట్ ఫైల్ ): ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఇవాళ ఓ అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తుండగా ఆమె కారు ప్రమాదానికి గురైంది.

2 లో

## తుంగభద్ర డ్యామ్ గేటు ధ్వంసం కావడం బాధాకరం



పొలిటికల్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ) : తుంగభద్ర డ్యామ్ గేట్లలో ధ్వంసమైన 19వ గేటును కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, రాయదుర్గం టీడీపీ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పరిశీలించారు. గేటు ధ్వంసం అవటానికి గల కారణాలను ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డ్యామ్

2 లో

## 2026 జూన్ లోపు భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభిస్తాం

● కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



విజయనగరం (జర్నలిస్ట్ ఫైల్) : విజయనగరం జిల్లా భోగాపురంలో చేపడుతున్న విమానాశ్రయ నిర్మాణాన్ని 2026 జూన్ లోపు ప్రారంభించాలని నిర్ణయించుకున్నమని కేంద్రమంత్రి కింజారాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రాజెక్ట్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. విజయనగరంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

ప్రతినెల ఎయిర్‌పోర్ట్ పనులను పరిశీలించి వేగవంతం

2 లో

## విశాఖ ఎమ్మెల్సీ కూటమిదే..

● జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



విశాఖపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ ) : విశాఖ జిల్లాలో జనసేన పార్టీ నుతన కార్యాలయం ప్రారంభమైంది. కార్యాలయం ప్రారంభోత్సవానికి జనసేన ఎమ్మెల్యే శ్రీనివాస్, మూవీ డైరెక్టర్ మెహర్ రమేష్, టీడీపీ, జనసేన నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పార్టీ కార్యాలయం ప్రారంభం అనంతరం జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడారు. జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభానికి టీడీపీ, బీజేపీ నేతలు కూడా రావడం సంతోషంగా ఉందని అన్నారు. విశాఖ వేదికగా

2 లో

## దివ్వెల మాధురి ఆత్మహత్యా యత్నం..

● దువ్వాడ శ్రీను భార్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఏపీ వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను తో వివాహేతర సంబంధం ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నాయకురాలు దివ్వెల మాధురి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. ఇటీవల ఆమెపై వస్తున్న

2 లో

# జగన్‌కు అంబేద్కర్ పేరెత్తే అర్హత లేదు..

● ఆ విగ్రహాన్ని అడ్డుపెట్టుకుని దోచుకున్నాడు

● టీడీపీ నేత బుద్దా వెంకన్న



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : ఐదేళ్ల పాలనలో ప్రజల డబ్బుతో మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి విలాసవంతమైన జీవితం గడిపాడని టీడీపీ నేత బుద్దా వెంకన్న విమర్శించారు. ఆదివారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ పై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోల్పోయి పట్టుమని రెండు నెలలు కూడా పూర్తి కాలేదు. అప్పుడే మతి భ్రమించి.. ఏం చేస్తున్నాడో కూడా అతనికి తెలియడం లేదని విమర్శించారు. అంబేద్కర్ విగ్రహంపెట్టి కేవలం తన పేరే పట్టుకున్నాడు.. అంబేద్కర్ పేరు కన్నా జగన్ పేరు పెద్దదిగా ఉంది. అందుకే అంబేద్కర్ అభిమానులు జగన్ పేరు తొలగించి ఉండవచ్చునని బుద్దా వెంకన్న పేర్కొన్నారు. జగన్ తన పాలనలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేశారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అవమానించిన వ్యక్తి జగన్. ఇప్పుడు వైసీపీ నేతలు ఏదో జరిగిపోయినట్లు అబద్దాలు ప్రచారం చేస్తున్నారంటూ విమర్శించారు.

గతంలో అమరావతిలో అంబేద్కర్ విగ్రహం పెట్టాలని చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. జగన్ సీఎం అయ్యాక రూ. 404కోట్లతో విజయవాడలో అంబేద్కర్ విగ్రహం పెట్టారు. ఇందులోకూడా 226 కోట్లు కొట్టేసిన ఘనుడు జగన్ అంటూ బుద్దా వెంకన్న విమర్శించారు. అంబేద్కర్ విగ్రహాలకుకూడా వైసీపీ రంగులు వేశారు. అంబేద్కర్ ను అడుగడుగునా అవమానించిన వ్యక్తి జగన్. అంబేద్కర్ మద్యం మాన్పించాలని చెబితే.. జగన్ మద్యం ఏరులై పారించాడు. మద్య నిషేధం అని ఓట్లు వేయించుకుని.. మద్యంతో కోట్లు దోచాడు. సంపద సృష్టించమని అంబేద్కర్ చెబితే ఉన్న సంపదను కొల్లగొట్టిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అంటూ బుద్దా వెంకన్న తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అమర్ రాజా

2 లో

# ఇక హిందూ దేవాలయాలకు మహర్దశ

● కృష్ణా, గోదావరి సంగం వద్ద హారతులు పున: ప్రారంభం

● అంతరాలయంలో శ్రీదుర్గమ్మ తల్లి వీడియోగ్రఫీ చేసిన వారిపై కఠిన చర్యలు

● రూ.113 కోట్ల సి.జి.ఎఫ్.నిధులతో 160 దేవాలయాల ఆధునీకరణ పనులు

● ధూప దీప నైవేద్యాలకై ప్రస్తుతం ఇచ్చే రూ.5 వేలను రూ.10 వేలకు పెంపు

● రెవిన్యూ సదస్సుల్లో దేవాదాయ భూములపై కూడా ఫిర్యాదులు స్వీకరిస్తారు

● రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : గతంలో కృష్ణా, గోదావరి పవిత్ర సంగం వద్ద జరిగే జల హారతులను పున: ప్రారంబించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ, ధర్మాధాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ దుర్గమ్మ తల్లి అంతరాలయంలో వీడియోగ్రఫీ చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రూ. 113 కోట్ల సి.జి.ఎఫ్.నిధులతో 160 దేవాలయాల ఆధునీకరణ పనులను చేపడుతున్నామన్నారు. ధూప దీప నైవేద్యాలకై ప్రస్తుతం ఇచ్చే రూ. 5 వేలను రూ. 10 వేలకు పెంపుచేస్తున్నామన్నారు. రెవిన్యూ సదస్సుల్లో దేవాదాయ భూములపై కూడా ఫిర్యాదులు స్వీకరిస్తారని, రాష్ట్ర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేవాదాయ భూముల పరిరక్షణకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సచివాలయంలో వారికి కేటాయించిన ఛాంబరు ఆధునీకరణ అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ మద్య కుటుంబ సభ్యులతో ఆదివారం ఉదయం ఛాంబరులోకి ప్రవేశించారు. రాష్ట్ర సచివాలయం రెండో బ్లాక్ లో ఆధునీకరించబడిన తమ ఛాంబరులో ప్రవేసించడానికి వచ్చిన ఆయనకు ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఇతర అధికారులు పుష్పగచ్చాలు అందజేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. పండితుల వేదమంత్రాల మద్య ఛాంబరులో పూజ అనంతరం తమ సీటులో ఆసీనులై తదుపరి రెండు ముఖ్యమైన ఫైళ్లపై మంత్రి తొలి సంతకం చేశారు. ఇందులో ఒకటి రూ. 113

2 లో

# ఆక్వా కేపిటల్‌గా ఆంధ్రా

● మత్స్య కారుల ఆదాయం పెంచేలా మథర్ షిప్ వ్యవస్థకు శ్రీకారం

● సీడ్ కోసం ఇప్పటికీ పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సిన దుస్థితిలో ఉన్నాం

● జగన్ ఐదేళ్ల పాలనలో ఎన్ఎఫ్ డీబీ నుండి రూపాయి కూడా తీసుకురాలేకపోయారు

● బందరులో మెరైన్ యూనివర్శిటీ ఏర్పాటుకు కృషి చేస్తా

● ఫిషింగ్ హార్బర్లో వాతావరణ పరిస్థితుల్ని అధికారులతో కలిసి పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) : మచిలీపట్నాన్ని రాష్ట్రానికి ఆక్వా కేపిటల్‌గా మార్చి తీరుతానని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు – ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ మేరకు గిలకలదిండిలో ఫిషింగ్ హార్బర్లో వాతావరణ పరిస్థితులు, ఫిషింగ్ కోసం మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని గ్లోబల్ ఎన్విరాన్ మెంటల్‌కు చెందిన ఏడుగురు సభ్యుల బృందంతో పరిశీలించారు. మచిలీపట్నాన్ని ఆక్వాహబ్ గా మార్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మత్స్య ఉత్పత్తులకు మచిలీపట్నం పెట్టింది పేరు అన్నారు. అప్పట్లో నడకుదిటి నరసింహారావు మంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన భవనంలోనే నేడు సమీక్ష ఏర్పాటు చేసుకున్నాం. వారి స్ఫూర్తికి నా మనస్ఫూర్తి ధన్యవాదాలు అన్నారు. మత్స్యకారుల ఆదాయం పెంపునకు ఉండే అవకాశాలను సమగ్రంగా అద్యయనం చేస్తున్నామన్నారు. తీర ప్రాంతానికి రక్షణగా నిలిచే మడ అడవుల్ని జగన్ రెడ్డి అధికారంలో ఉన్నపుడు దారునంగా నాశనం చేశాడన్నారు. వారు చేసిన విధ్వంసం కారణంగా మత్స్యకారులు ఎక్కువగా నష్టపోతున్నారన్నారు. మత్స్య సంపద ఎదుగుదలకు మడ అడవులు ఎంతో కీలకమని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సంప్రదాయ వనరుల స్థానంలో పునరుత్పాదక ఇందన వినియోగానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. ఇప్పటికే చాలా దేశాల్లో సోలార్ పవర్డ్ బోట్స్ అందుబాటులోకి వచ్చాయని, మనం కూడా ఆ సాంకేతికతను వినియోగించుకోవడానికి ప్రయత్నించాలన్నారు. అదే సమయంలో రవాణా, ఎగుమతుల సమయంలో జరుగుతున్న ప్రమాదాల్లో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని, అందులోనూ నూతన ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీడ్‌కు వ్యాధుల నివారణ కోసం ప్రత్యేక చర్యలు అవసరం అన్నారు. చిన్న చిన్న పడవల్లో వేటకు వెళ్లే వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలు పరిష్కరించేందుకు మథర్ షిప్ వ్యవస్థను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. తద్వారా ఒకసారి వేటకు వెళితే ఎన్ని రోజులున్నా.. వారికి అవసరమైన ఇంధనం, ఐస్ లాంటివన్నీ ఆ మథర్ షిప్ నుండి పొందే అవకాశం

2 లో

## జగన్ .. నిర్లక్ష్య పాలనతో అన్నదాతల ఆత్మహత్యలు

(మొదటి పేజీ తరువాయి)

శుద్ధి చేసి ఉండేవారు. పంటల బీమా, విత్తనాలు, ఎరువులు, రాయితీపై బిందు సేద్యం, రాయితీపై యంత్రపరికరాలు, ఉద్యాన పంటల రాయితీ.. వీటిలో ఒక్కటైనా రైతులకు అందించావా? సిగ్గు లేకుండా రాష్ట్రం నుంచి పారిపోయి రాజకీయ డ్రామాలు మొదలు పెట్టావు.

'అసెంబ్లీ సమావేశాలకు వస్తే నీ చేతకానితనం స్పష్టంగా నీకు తెలుస్తుంది. అన్నీ లెక్కలతో సహా వివరిస్తాం. వ్యవసాయ అనుబంధ రంగాల్లో రూ. 2,384 కోట్ల బకాయిలు పెట్టావు. వ్యవసాయానికి తోడ్పాటు అందించే బిందు సేద్యం అమలు చేయకుండా కంపెనీలకు రూ. 1167 కోట్లు, ధాన్యం బకాయిలు రూ. 1600 కోట్లు బకాయిలు పెట్టి అన్నదాతలను ఇబ్బందులు పెట్టావు. కౌలు రైతులకు, మత్స్యకారులను నీర్వీర్యం చేసే పనికిమాలిన చట్టాలు తెచ్చావు. ధరల స్థిరీకరణ నిధి అని చెప్పి అసలు గిట్టుబాటు ధరే లేకుండా చేశావు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో రూ. 3లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు ఇస్తే నువ్వు వచ్చి దాన్ని లక్షకి పరిమితం చేసావ్. రాష్ట్రంలో ఒక్కోరైతు నెత్తిన రూ 2.75 లక్షల అప్పు మోపిన నువ్వు మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది.' అంటూ జగన్‌పై ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు మంత్రి అచ్చెన్నాయుడు.

## విశాఖ ఎమ్మెల్సీ కూటమిదే..

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా జనసేన పార్టీ ఆఫీసులో నేను అందుబాటులో ఉంటానని అన్నారు. రాష్ట్ర ప్రజలకు అండగా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిరంతరం శ్రమిస్తున్నారు. విశాఖను ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దే విధంగా మా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. విశాఖలోఉన్న సహజ వనరులను వినియోగించుకుంటూ టూరిజం పరంగా, ఐటీ పరంగా అభివృద్ధి చెయ్యాలని కూటమి ప్రభుత్వం ఆలోచనలో ఉందని చెప్పారు.

విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఎవరనేది రేపు ప్రకటించే అవకాశం ఉందని వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తరపున బరిలో నిలిచే అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి తీరుతామని అన్నారు. ఎవరి వ్యక్తి గత విషయాలను మాట్లాడను. కానీ, కార్పొరేటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో భాగంగా మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ వారిని విహార యాత్రలకు తిప్పుతున్నాడని అన్నారు. ఎవరెన్ని ఎత్తులు వేసినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని జనసేన ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. దువ్వాడ ఇష్యూపై స్పందిస్తూ.. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కష్టాల్లో ఉన్నాడు.. ఆయనకు నా సానుభూతిని తెలుపుతున్నానని వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు.

## తుంగభద్ర డ్యామ్ గేటు ధ్వంసం కావడం బాధాకరం

(మొదటి పేజీ తరువాయి)

19వ గేటు ధ్వంసం కావడం బాధాకరమని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు అన్నారు. ఈ డ్యామ్ కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ.. 3 రాష్ట్రాలకు వరప్రదాయిని అని తెలిపారు. తుంగభద్ర డ్యామ్ లో 60 టీఎంసీల నీరు నిల్వ ఉంచే విధంగా ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ధ్వంసమైన గేటుపై ఒత్తిడి పెరగడకుండా.. మిగతా గేట్ల ద్వారా 30వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. వీలైనంత త్వరగా గేటు పునరుద్ధరణ చేస్తామని వెల్లడించారు.

తుంగభద్ర డ్యామ్ 19వ గేటు శనివారం రాత్రి ఊడిపోయింది. డ్యామ్ ఇన్ ఫ్లో తగ్గడంతో రాత్రి డ్యామ్ గేట్లు మూసివేసేందుకు ప్రయత్నించారు. దాంతో 19వ గేటు చైన్ తెగింది. గేటు తీసే సమయంలో తగిన జాగ్రత్తలు అధికారులు తీసుకోలేదు. గేటు తెగడంతో నీటి ప్రవాహం పోటెత్తింది. ధ్వంసమైన గేటుపై ఒత్తిడి తగ్గించేందుకు తుంగభద్ర డ్యామ్ 33 గేట్ల నుంచి నీరు బయటకు వదిలారు. మరోవైపు ప్రాజెక్ట్ నుంచి 60 టీఎంసీల నీరు బయటకు పంపిన తర్వాత గేటు పునరుద్ధరణ పనులు చేపట్టే అవకాశం ఉంది.

## దివ్వెల మాధురి ఆత్మహత్యా యత్నం..

(మొదటి పేజీ తరువాయి)

తప్పుడు ఆరోపణలు, ట్రోలింగ్స్‌ను చూడలేక ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించానని వెల్లడించారు.

ఆదివారం శ్రీకాకుళం జిల్లా పలాస మండలం లక్ష్మీపురం టోల్‌గేట్ వద్ద ఆగి ఉన్న కారును వేగంగా వెనుక నుంచి వచ్చి మరో కారును ఢీ కొట్టడంతో కారు బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడ్డ మాధురిని పలాస ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలో మీడియాతో మాట్లాడుతూ 'నేను డిప్రెషన్‌లో ఉన్న .. చనిపోయేందుకే బయటకి వచ్చానని' పేర్కొన్నారు.

దువ్వాడ శ్రీనివాస్, నాపై , నా ముగ్గురు ఆడ పిల్లలపై వస్తున్న ట్రోలింగ్స్‌ను భరించలేక కారు ఆక్సిడెంట్‌తో ఆత్మహత్యకు పాల్పడినట్లు వెల్లడించారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న దువ్వాడ శ్రీను భార్య శ్రీవాణిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా తన పిల్లలపై చేసిన ఆరోపణలపై కూడా చిల్డ్రన్ రైట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరోసారి ఆత్మహత్యా యత్నానికి ఒడిగడుతానని హెచ్చరించారు.

గత రెండురోజులుగా ఏపీలో హాట్‌టాపిక్‌గా మారిన ఎమ్మెల్సీ వ్యవహారంలో దువ్వాడ శ్రీను భార్య శ్రీవాణి మాధురిపై తీవ్ర ఆరోపణలు చేసింది. తన భర్తతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని ఆరోపిస్తూ శ్రీను ఇంటిపై కూతుళ్లతో కలిసి దాడి చేసింది. దివ్వెల మాధురి అనే మహిళతో సంబంధం పెట్టుకుని తమను వదిలేశారని దువ్వాడ శ్రీనివాస్ కుమార్తెలు ఆందోళన చేపట్టారు.

ఈ క్రమంలో తనపై వస్తున్న ఆరోపణలపై దివ్వెల మాధురి కూడా స్పందించారు. దువ్వాడ శ్రీనివాస్‌ను తాను ట్రాప్ చేయలేదని స్పష్టం చేశారు. తననే దువ్వాడ శ్రీనివాస్ సతీమణి వాణి రాజకీయంగా తనను ట్రాప్ చేసిందని ఆరోపించారు. ఎమ్మెల్యే టికెట్ పొందడం కోసం తనను పావుగా వాడుకుందని తెలిపారు.

## 2026 జూన్ లోపు భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చే శక్తి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కి ఉందని అన్నారు. ఇప్పటి వరకు 36.6 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. అనుకున్న సమయానికి ముందే పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

ఉడాన్ స్కీమ్ వల్ల మన దేశ విమానయాన శాఖ ప్రపంచంలోనే ఉన్నతంగా తయారైందని రామ్మోహన్ నాయుడు చెప్పుకొచ్చారు. ఓర్వకల్లు, దగదర్తి, నాగార్జునసాగర్, కుప్పంలో విమానాశ్రయాలను త్వరలో నిర్మిస్తామని చెప్పారు. తెలంగాణలో కూడా కొత్త విమానాశ్రయాలను నిర్మిస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా అనేక విమానాశ్రయాలను త్వరలోనే పూర్తి చేయనున్నామని అన్నారు.

## చంద్రబాబు, పవన్ , ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు నాకేం కాదు

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ నుంచి అనిత పశ్చిమ గోదావరి జిల్లాలోని అలంపురం సైనిక పాఠశాలకు వెళ్తున్న సమయంలో ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం జాతీయ రహదారి వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది.

పక్క నుంచి వచ్చిన ఓ బైక్‌ను తప్పించే సమయంలో ఆమె ఎస్కార్ట్ వాహన డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో బైకును అనిత ప్రయాణిస్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో అనిత కారు, ఎస్కార్ట్ వాహనం స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కారు ప్రమాదంపై అనిత స్పందిస్తూ ఎక్స్‌కార్ట్ వాహనానికి బైక్ అడ్డు వచ్చినప్పుడు తమ డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించడంతో ప్రమాదం తప్పిందని తెలిపారు. తన బుల్లెట్ ప్రూఫ్ వాహనం స్వల్పంగా డామేజ్ అయ్యిందని చెప్పారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, ప్రజల ఆశీస్సులు ఉన్నంతవరకు తనకేంకాదని తెలిపారు. అందరు తనకు ఫోన్లు చేస్తున్నారని, తాను బాగానే ఉన్నానని చెప్పారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందే అవసరం లేదని అనిత తెలిపారు.

# ఇక హిందూ దేవాలయాలకు మహర్ధశ

(మొదటి పేజీ తరువాయి)

కోట్ల సి.జి.ఎఫ్. నిధులతో రాష్ట్రంలోని 160 దేవాలయాల ఆధునీకరణ పనులకు సంబంధించినది కాగా, మరొకటి తూర్పుగోదావరి జిల్లా మండపేటలో నున్న శ్రీ అగస్తేశ్వర స్వామి దేవాలయాన్నిరూ 1.00 కోటి సి.జి.ఎఫ్. నిధులతో ఆధునీకరించే పనులకు సంబంధించినది. ఈ 160 దేవాలయాల్లో 147 ప్రాధాన్యత దేవాలయాలు మైదాన ప్రాంతాల్లోవి కాగా మిగిలిన 13 దేవాలయాలు వెనుకబడిన మరియు గిరిజన ప్రాంతాలోనివిగా మంత్రి తెలిపారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో సుపరిపాలన దిశగా తమ ప్రభుత్వం అడుగుల వేస్తున్నదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా, భక్తులకు ఆ భగవంతుని ఆశీస్సులు ఉండే విధంగా, భగవంతుని ఆస్తులను పరిరక్షించే విధంగా ఎల్లప్పుడు సంసిద్దులుగా ఉండటమే తమ ప్రథమ బాధ్యత, కర్తవ్యం అన్నారు. గత ప్రభుత్వ పాలనలలో తిరుమల నుండి ఉత్తరాంద్రలోని అరసవిల్లి వరకూ దేముని ఆస్తులను కూడా వదలని పరిస్థితులు అనేకం మీడియా ముఖంగా వెలువడిన పరిస్థితి అందరికీ తెలుసన్నారు. ఈ విషయంలో ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుని చర్యలు చేపట్టాల్సిన గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. కానీ తాము అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎటు వంటి ఆరోపణవచ్చినా సరే వెంటనే నివేదికలు తెప్పించుకుని బాద్యులైన వారిపై చర్యలు తీసుకుంటూ పాలనను ముందుకు తీసుకుపోవడం జరుగుచున్నదన్నారు. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లాలో రెండు ఆలయాలకు సంబంధించి విచారణ జరిపించి, వచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా తప్పు జరిగినట్లు నిర్ధారించుకుని, అందుకు బాధ్యులైన ఐదుగురు అధికారుల నుండి వివరణ తీసుకుని సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. సమగ్ర విచారణలో ఎటు వంటి తప్పులు జరుగలేదని రూఢీ అయితే వారిపైనున్న సస్పెన్షన్ను ఎత్తి వేసి తిరిగి వారిని విధుల్లోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. దేవాదాయ శాఖలో తప్పుచేసిన చిన్న అధికారులనే కాదు పెద్ద అధికారులను కూడా ఏ మాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన తెలిపారు. ఇందుకు తార్కాణం ఈ మధ్య మీడియాలో ప్రతి నిత్యం వచ్చిన వార్తలను అనుసరించి దేవాదాయ శాఖలోని ఒక అధికారిణి సహాయంతో ప్రతి పక్షంలోని కొందరు ఎంపీలు, ప్రతి పక్షపార్టీ నాయకులు చేసి దురాగతాలపై విజిలెన్సు ఎంక్వరీ జరిపించడమే అన్నారు. విజిలెన్సు విచారణ సమయంలో ఆ అధికారిణిని సస్పెండ్ కూడా చేయడం జరిగిందన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రిగా శ్రీ నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టబోయేముందు తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న తదుపరి ఈ తిరుమల నుండే ప్రక్షాళన మొదలు పెడతాం అని చెప్పిన విధంగా దేవాదాయ శాఖ ప్రక్షాళనను కూడా తిరుమలే నుండే ప్రారంభించడం జరిగిందన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ తెలుసుకున్న అంశాలు మరియు ప్రజాగళం, యువగళం కార్యక్రమంలో వచ్చిన వినతులకు అనుగుణంగా దేవాదాయ శాఖ తగు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

రాష్ట్ర విభజన కారణంగా భద్రాచలం తెలంగాణా రాష్ట్రంలోని వెళ్లిన నేపథ్యంలో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణకై కడప జిల్లాలోని ఒంటిమిట్టను ఎంపికచేసి, తిరుమల తిరుపతి దేవస్థానం యొక్క ఆలయాలతో పాటే ఈ దేవాలయాన్ని కూడా అభివృద్ధి పర్చడం జరుగుచున్నదన్నారు. రాష్ట్రంలో ఇంకా ఉన్నటు వంటి పుణ్యక్షేత్రాలను అన్నింటినీ పరిశీలించి, వాటి పవిత్రతకు ఎటు వంటి భంగం కలుగకుండా వారి అభివృద్ధి చర్యలను దేవాదాయ శాఖ చేపడుతున్నట్లు తెలిపారు.

దేవాదాయ శాఖ అదీనంలో మొత్తం 27,105 దేవాలయాలు ఉన్నాయని, వీటిలో 6(ఎ) ఆలయాలు 236 ఉన్నట్లు మంత్రి తెలిపారు. అదే విధంగా ఈ శాఖ పరిధిలో మొత్తం 4,65,000 ఎకరాల భూమి ఉందని, ఆ భూమి ఏ మాత్రం అన్యాక్రాంతం కాకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దేవాదాయ శాఖ పరిధిలో మొత్తం 20,839 మంది సిబ్బంది ఉన్నారని, వారిలో మత పరంగా 11,142 మంది, పాలనా పరంగా 9,697 మంది పనిచేస్తున్నారన్నారు. మొత్తం 1,234 ట్రస్టు బోర్డులు ఉన్నాయని, వీటిలో పలు కారణాల వల్ల కొన్ని ఖాళీగా ఉన్నాయని, మరో 462 నూతన బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

**కృష్ణా, గోదావరి జలాల పవిత్ర సంగం వద్ద హారతులు పున: ప్రారంభం**

గతంలో తమ ప్రభుత్వ హయాంలో పట్టిసీమ ప్రాజక్టును పూర్తిచేసి కృష్ణా, గోదావరి జలాల పవిత్ర సంగం ఫెర్రీ ఘాట్ వద్ద హారతులు ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహించండ జరిగిందన్నారు. అయితే గత ప్రభుత్వం హారతులు ఇచ్చే పవిత్ర కార్యక్రమాన్ని నిలిపివేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు ఆదేశాల మేరకు మళ్లీ ఆ హారతుల కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం పున:ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకై సోమవారం రాష్ట్ర సచివాలయంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తదితరులతో కూడిన మంత్రుల బృందం సమావేశమై హారతులు ఇచ్చే కార్యక్రమంపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

**అంతరాలయంలో శ్రీ దుర్గమ్మ తల్లి వీడియోగ్రాఫీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం**

ఈ నెల 7 వ తేదీన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ దుర్గమ్మతల్లి మూల విరాట్ ను ఒక వ్యక్తి వీడియోగ్రాఫీ చేసినట్లు, సోషల్ మీడియాలో షేర్ చేసినట్లు ఒక మీడియా చానల్లో ప్రసారం చేయడం జరిగిందన్నారు. సాధారణంగా ఏ ఆలయంలో అయినా అంతరాలయంలోని మూల విరాట్ ను అర్చకులు తప్ప మరెవ్వరూ తాకకూడదు, అంతరాలయంలోని వెళ్ల కూడదు అన్నారు. ఈ విషయాన్ని దేవాదాయ శాఖ తీవ్రంగా పరిగణిస్తూ విచారణ జరిపించి నివేదికతో పాటు సీసీ ఫుటేజీలను విజయవాడలోని పోలీస్ కమిషనర్ కు తగు చర్యకై అందజేయడం జరిగిందన్నారు. పోలీసులు ఈ విషయంలో విచారణ చేస్తున్నారని, అందుకు బాధ్యుడై వ్యక్తిని కూడా గుర్తించడం జరిగిందన్నారు. మీడియాలో చెప్పినట్లుగా వీడియోగ్రఫీతీసిన వ్యక్తి మహిళ కాదని, పురుషుడే అని నిర్ధారించడం జరిగిందన్నారు. ఇటు వంటివి మరోసారి పునరావృతం కాకుండా పోలీస్ నివేదిక అందగానే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 27,105 దేవాలయాలు ఉన్నాయని, ఆ దేవాలయాల అంతరాలయంల్లోని మూల విరాట్ ను పిక్చరైజ్ చేయవద్దని, ఎవరూ తాకవద్దని విజ్ఞప్తి చేస్తూ అందుకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది మంత్రి హెచ్చరించారు.

**ధూప దీప నైవేద్యాలకై ప్రస్తుతం ఇచ్చే రూ.5 వేలను రూ.10 వేలకు పెంపు**

దేవాదాయ శాఖ పరిధిలో 50 వేల లోపు ఆదాయం ఉన్న ఆలయాలకు గతంలో ప్రతి నెలా రూ. 5 వేలు ఇస్తుంటే, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దాన్నిరూ. 10 వేలకు పెంచుతూ ప్రతిపాదనలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆమోదం కోసం పంపడం జరిగిందని, త్వరలోనే జి.ఓ. కూడా జారీచేయడం జరుగుతుందన్నారు. ఫలితంగా ప్రతి ఏడాది దాదాపు రూ. 32 కోట్లు అదనపు భారం దేవాదాయ శాఖ మీద పడుతుందని అంచనా వేయడం జరిగిందన్నారు.

**రెవిన్యూ సదస్సుల్లో దేవాదాయ భూములపై కూడా ఫిర్యాదులు స్వీకరిస్తాం**

రెవిన్యూ శాఖ పరంగా ప్రజలకు ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే లక్ష్యంతో రెవిన్యూ సదస్సులను ఆగస్టు 15 న ప్రభుత్వం లాంచనంగా ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అన్ని రెవిన్యూ గ్రామాల్లో ఈ సదస్సులను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆద్వర్యంలో డివిజనల్, మండల, గ్రామ స్థాయి అధికారులతో నిర్వహించే ఈ రెవిన్యూ సదస్సులను పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయి నుండి ఒక ప్రత్యేక అధికారిని కూడా ప్రతి జిల్లాకు పంపడం జరుగుచున్నదన్నారు. ఈ రెవిన్యూ సదస్సుల్లో దేవాదాయ శాఖకు సంబంధించిన భూములపై కూడా నివేదికలు, ఫిర్యాదులు అందితే వాటిపై కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ దేవాదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా వాటి పరిరక్షణకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ ఆజాద్, డిప్యూటీ కమిషనర్ రతన్ రాజు తదితర అధికారులతో పాటు పలువురు అనధికారులు, మంత్రి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వక్ఫ్ చట్టం రక్షణకు జాయింట్ యాక్షన్ కమిటీ

- ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ఉద్యమం
- ఆప్ కి ఆవాజ్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



**కడప జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) :** భారతదేశంలో లక్షలాది కోట్ల రూపాయల వక్స్ సంపదను కాపాడే లక్ష్యంగా కడప జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ని త్వరలో ఏర్పాటు చేయాలని అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా తీర్మానించాయి అలాగే కేంద్ర రాష్ట్రాల్లోని ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ స్థాయిలో ఉద్యమం ప్రారంభించాలని నిర్ణయించాయి కడప రహమతీయ ఫంక్షన్ హాల్ లో శనివారం ఆప్ కి ఆవాజ్ ఆధ్వర్యంలో జరిగిన అన్ని రాజకీయ పార్టీలు ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి జేఏసీ కన్వీనర్ బాబు భాయ్ అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీఖాన్ ఆర్ సి పి వ్యవస్థాపక అధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్ బాబు ఆప్ కి అవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాషా, ఇన్ సాబ్ జిల్లా అధ్యక్షులు బాదుల్లా, సంఘ సేవకులు సలావుద్దీన్, ఎంఆర్ఎఫ్ అధ్యక్షుడు దస్తగిరి వివిధ పార్టీల ప్రజాసంఘాల. నేతలు మాట్లాడుతూ, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ఏకంగా రక్త చట్టానికి 40 సవరణలు ప్రతిపాదించడం దారుణమన్నారు అంతే కాకుండా వక్స్ బోర్డు కౌన్సిల్లో ముస్లిం ఇతర సభ్యులను నియమించాలని మైనార్టీలను అణగదొక్కడమేనని విమర్శించారు. జిల్లా కలెక్టర్లకు విచక్షణాధికారులు ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వాధికారాలను పూర్తిగా తగ్గించడంతో దేశంలోని లక్షలాది కోట్ల సంపదను దురాక్రమణ చేసేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. అంతేకాకుండా ఇప్పటికీ దురాక్రమణలో ఉన్న ఆస్తులను కాపాడడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం కాగా వర్క్ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు ఏకంగా 40 సవరణలు తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఇండియా విపక్ష కూటమి సభ్యులు తీవ్రంగా అభ్యంతరం చెప్పడంతో బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి అప్పగించారన్నారు. వీలైనంత త్వరగా భారీ స్థాయిలో ఆందోళనలు చేపట్టి సంకీర్ణ ప్రభుత్వానికి గుణపాఠం నేర్పిస్తామన్నారు. మైనార్టీల అభివృద్ధికి దేశంలో మూడో స్థానంలో సంపద కలిగిన బోర్డులను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తే తలవంచబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రజాసంఘాల నేతల మైనుద్దీన్ , జాకీర్ మౌలానా, హమీద్ మౌలాలి ఆప్ కి ఆవాజ్ నగర అధ్యక్షులు అబీద్ హుసేన్ అబ్దుల్లా మత గురువులు సిరాజ్ బుఖారి బషీర్ తదితరులు పాల్గొన్నారు

## ఆక్వా కేపిటల్‌గా ఆంధ్రా

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని తెలిపారు. సీడ్ విషయంలో కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకోవాలని భావిస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని మత్స్యరంగంలో అగ్రస్థానంలో నిలిపే అవకాశం ఉన్నదన్నారు.

కేంద్ర మంత్రుల్ని కలిసి రాష్ట్ర అభివృద్ధి, మచిలీపట్నం అభివృద్ధికి నివేదికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. విజయవాడ – మచిలీపట్నం హైవే నిర్మాణానికి గతంలో గడ్కరీ సహకరించారు. ఇప్పుడు సాగరమాల పథకంలో భాగంగా సముద్ర తీరానికి 500 మీటర్ల దూరంలో హైవే ఏర్పాటు, మచిలీపట్నం–రేపల్లె రైల్ మార్గం ఏర్పాటు, మచిలీపట్నంలో టూరిజం అభివృద్ధి, బ్యాక్ వాటర్స్ ద్వారా పర్యాటకాభివృద్ధికి కేంద్ర సహకారం కోరతామన్నారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఫిషింగ్ హార్బర్ అంచనాలు పెంచడం తప్ప చేసిందేమీ లేదన్నారు. బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ల పరిశీలనకు త్వరలో రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రులు రాబోతున్నారని, వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్ర కొల్లు రవీంద్ర తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్య శాఖ కమిషర్ తమ్ము డోలా శంకర్, అదనపు డైరక్టర్ డా. అంజలి, మత్య శాఖ జేడీ ఏ. చంద్రశేఖర్, జిల్లా అటవీ అధికారి కే. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నిడమర్రు గ్రామానికి చెందిన ముద్దాయిలకు ఎస్సై వెంకట్ కౌన్సిలింగ్



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన ముద్దాయిలకు ఆదివారం రూరల్ ఎస్సై వెంకట్ కౌన్సిలింగ్ ఇచ్చారు. గత రెండు నెలల క్రితం నిడమర్రు గ్రామంలో జరిగిన కొట్లాటలో అరెస్ట్ కాబడిన ముద్దాయిలకు కోర్టు కండిషన్ బెయిల్

ఇచ్చి%శీ%ది. ఆదివారం పోలీస్ స్టేషన్ కి ముద్దాయిలు వచ్చారు ఈ సందర్భంగా ఎస్సై వెంకట్ ముద్దాయిలను గట్టిగా హెచ్చరించారు. మరల ఎటువంటి కొట్లాటలకు గొడవలకు పాల్పడ కూడదని కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగినది. ప్రజలందరూ శాంతి భద్రతలకు ఎటువంటి ఆటంకం కలిగించరాదని, ఏదైనా గొడవలకు పాల్పడితే వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఎస్సై వెంకట్ హెచ్చరించారు.

## జగన్‌కు అంబేద్కర్ పేరెత్తే అర్హత లేదు..

(మొదటి పేజీ తరువాయి)

వంటి ఎన్నో పరిశ్రమలను బయటకు పంపించిన జగన్ మోహన్ రెడ్డి.. ఏపీకి పారిశ్రామిక వేత్తలు రావాలంటేనే భయపడేలా చేశాడంటూ బుద్దా వెంకన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులపై దమనకాండకు పాల్పడిన వారిని జగన్ కాపాడాడు. బాధిత కుటుంబాలు ను ఎప్పుడైనా సీఎంగా పరామర్శించావా జగన్ అంటూ ప్రశ్నించారు. ఇప్పుడు మీలో మీరుకొట్టుకుని చనిపోతే.. టీడీపీపై నింద వేశావు. 27 సంక్షేమ పథకాలను దళితులకు ఇవ్వకుండా జగన్ నిలిపేశాడు. అంబేద్కర్ పేరు తొలగించి తన పేరు పెట్టుకున్న సైకో జగన్ అంటూ బుద్ధా వెంకన్న తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు

జగన్ పాలనలో ఎంతమంది దోషులను పట్టుకున్నారో చెప్పాలి. డ్రైవర్ ను చంపిన నీ ఎమ్మెల్సీని కూడా సస్పెండ్ చేయకుండా పక్కన పెట్టి తిరుగుతున్నావు. అంబేద్కర్ విగ్రహాన్ని అడ్డం పెట్టుకుని దోచుకున్న వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి.. ఈ విగ్రహం నిర్మాణం, ఖర్చుపై విచారణ చేయాలన్నారు. అమరావతి లో అంబేద్కర్ విగ్రహం కట్టి తీరతామని బుద్దా వెంకన్న చెప్పారు. అధికారం కోల్పోయిన తరువాత ట్విట్టర్ లో రెచ్చగొట్టే పోస్ట్ లు పెట్టి జగన్ రాక్షస ఆనందం పొందుతున్నారు. సంపద సృష్టి లేకుండా అభివృద్ధి ఎలా జరుగుతుందో కూడా జగన్ తెలియదు. చంద్రబాబు సారధ్యంలో ఏపీ అభివృద్ధి ఎలా ఉంటుందో చూపుతాం. జగన్ మళ్లీ వచ్చి ఉంటే రోబోలను పెట్టుకుని ప్రజలను తరిమి కొట్టేవాడు. కులాల చిచ్చు పెట్టి వచ్చే పరిశ్రమ లను ఏపీ రాకుండా జగన్ కుట్ర చేస్తున్నాడు. చంద్రబాబు విజన్, పాలనా దక్షత ముందు నువ్వు, నీ తాత ఆటలు సాగవు. జగన్ ఇప్పుడైనా రాష్ట్ర అభివృద్ధి కి సహకరించు. అడ్డుకునేలా కుట్ర చేస్తే ఈసారి ప్రజలే నిన్ను తరిమి కొడతారని బుద్ధా వెంకన్న హెచ్చరించారు.

## సీఆర్పీ సమస్యలు మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్తాం..

- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ,
- మంగళగిరి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త నందం అబద్దయ్య




మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) : సీఆర్పీ సమస్యలు ఐటి మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు, మంగళగిరి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త నందం అబద్దయ్య తెలిపారు.

మంగళగిరి ఎస్ఎల్ఎం చైతన్య స్కూల్ అవరణలో సమగ్ర శిక్ష, పాఠశాల శాఖ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సీఆర్పీ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జీవో నెం 65 వ్యతిరేకంగా 22 రోజుల పోరాట సమ్మె దినాలకు వేతనం ఇప్పించేందుకు కృషి చేస్తున్నా మన్నారు.

జాబ్ చార్ట్ అమలు, ఉద్యోగ భద్రత, హెచ్ఆర్ పాలసీ, జీవో 65 రద్దు, తదితర అంశాలను రానున్న రోజులలో మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

సమావేశంలో సీఆర్పీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు గిరి శ్రీనివాస్ , కార్యదర్శి కె గురువులు పి కిషోర్ ( నందిగామ) కాపునాడు టీచర్స్ ఫెడరేషన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జివిల్వి మాధవరావు యు సాయి కుమార్, రామాంజనేయ రెడ్డి, బేతపూడి మధు రాష్ట్ర నలుమూల ల నుండి వచ్చిన సీఆర్పీలు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి
జన్మదిన శుభాకాంక్షలు, పొలిటికల్, స్వదేశాగమనం, లీగల్ ప్రకటనలు, క్లాసిఫైడ్స్ పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, సినిమా, వివాహ మహోత్సవం, షష్టిపూర్తి మహోత్సవం మరియు అన్ని శుభకార్యాలు
ప్రకటనల విభాగం
76 61 80 59 68

## సెబీ ఛైర్‌పర్సన్‌పై హిండెన్‌బర్గ్ ఆరోపణలు.. భగ్గుమన్న విపక్షాలు



**ఢిల్లీ:** అమెరికా షార్ట్‌సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తాజాగా సంచలన ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువలు కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషస్ ఫండ్‌లలో సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయని ఆరోపించింది. ఈ ఆరోపణలపై విపక్షాలు మండిపడుతున్నాయి.
అదానీ గ్రూప్‌పై కేంద్రం తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. "అదానీ గ్రూప్ చేస్తున్న కుంభకోణాలపై దర్యాప్తు విషయంలో సెబీ ఆసక్తి కనబరచకపోవడానికి గల కారణం ఇప్పుడు అర్థమైంది. దీనిని సుప్రీం కోర్టు నిపుణుల కమిటీ కూడా గుర్తించలేకపోయింది" అని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అన్నారు. 2023లో అదానీ గ్రూప్ చేస్తున్న అవకతవకలపై హిండెన్‌బర్గ్ నివేదిక వెలువరించినప్పుడు 13 అనుమానాస్పద లావాదేవీలపై దర్యాప్తు చేస్తున్నామని సెబీ నిపుణుల కమిటీకి తెలిపిందన్నారు. ఇందువల్లే ఇప్పటికీ వారు చేస్తున్న దర్యాప్తు పూర్తి కాలేదేమో అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ముందు పార్లమెంటు సమావేశాలు ఆగస్టు 12 వరకు కొనసాగుతాయని చెప్పిన కేంద్ర ప్రభుత్వం.. ఆగస్టు 9న మధ్యాహ్నం అకస్మాత్తుగా వాయిదా వేయడానికి కారణం ఏమై ఉండొచ్చో ప్రజలకు ఇప్పుడు అర్థమవుతోందన్నారు.
తృణమూల్ కాంగ్రెస్ నేత మహువా మొయిత్రా ఎక్స్ వేదికగా స్పందిస్తూ "సెబీ ఛైర్మన్ కూడా అదానీ గ్రూపులో పెట్టుబడిదారుడే.. ఇక్కడ క్రోనీ క్యాపిటలిజం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు సీబీఐ, ఈడీ సెబీ చీఫ్‌పై దర్యాప్తు ప్రారంభిస్తారా?" అంటూ ప్రశ్నించారు. గతంలో అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలను సుప్రీం పునఃసమీక్షించాలని ఆమె కోరారు.
శివసేన (యూబీటీ) నాయకురాలు ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ అదానీ గ్రూప్ కంపెనీల వివరాలను కోరుతూ తాను రాసిన లేఖలకు సెబీ ఎందుకు సమాధానం ఇవ్వలేదో ఇప్పుడు స్పష్టమైందని అన్నారు.
హిండెన్‌బర్గ్ రీసెర్చ్ శనివారం విజిల్‌బ్లోయర్ పత్రాలను ఉదహరిస్తూ గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ నియంత్రణలో కొన్ని ఆఫ్‌షోర్ బెర్ముడా, మారిషస్ ఫండ్‌లు ఉన్నాయని, ఇందులో మాధబి పురి, ఆమె భర్త ధావల్ బచ్‌లకు వాటాలు ఉన్నాయని ఆరోపించింది. ఈ దంపతుల వాటాల నికర విలువ 10 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 83 కోట్ల) వరకు ఉండొచ్చని తెలిపింది.

## రైల్లో అగ్నిప్రమాదం వదంతులు..



**ఉత్తర్‌ప్రదేశ్:** అగ్నిప్రమాదం చోటుచేసుకుందన్న పుకార్లతో భయాందోళనలకు గురైన కొంతమంది ప్రయాణికులు.. కదులుతున్న రైల్లోంచి కిందికి దూకేశారు. ఈ క్రమంలో పలువురికి గాయాలయ్యాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బిల్‌పుర్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది.
రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హావ్‌డా– అమృత్‌సర్ ఎక్స్‌ప్రెస్ రైలు బరేలీలోని బిల్‌పుర్ స్టేషన్‌కు చేరుకున్న సమయంలో.. ఓ జనరల్ బోగీలో మంటలు చెలరేగినట్లు వదంతులు వ్యాప్తించాయి. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు ఎమర్జెన్సీ చైను లాగారు. అంతలోనే అగ్నిప్రమాదం భయంతో పలువురు ప్రయాణికులు కదులుతున్న రైల్లోంచి కిందికి దూకేశారు. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి.
రైల్లో కొంతమంది ఆకతాయిలు అగ్నిమాపక పరికరాన్ని వినియోగించారని.. దీంతో మంటలు చెలరేగినట్లు భావించిన ప్రయాణికులు కిందికి దూకేశారని తొలుత అధికారులు పేర్కొన్నారు. 12 మందికి గాయాలైనట్లు తెలిపారు. ఈ ఘటనపై ఆర్పీఎఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.

## రష్యా భూభాగంలో మా దళాల దాడి నిజమే: ఉక్రెయిన్



**రష్యా:** రష్యాలోని కర్స్క్ ప్రాంతంలో తమ దళాలు ముందుకు దూసుకెళుతున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తొలిసారి అంగీకరించారు. శనివారం రాత్రి ఆయన తన ప్రసంగంలో మాట్లాడుతూ.. ఆక్రమణదారు భూభాగంలోకి తమ సైన్యం పోరాటాన్ని బదిలీ చేసిందని వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్ ఈ ఆపరేషన్ మొదలుపెట్టిన ఐదు రోజుల తర్వాత జెలెన్‌స్కీ నుంచి ధ్రువీకరణ రావడం గమనార్హం. ఈ ఎదురుదాడి మొదలైన నాటి నుంచి రష్యా సరిహద్దుల వద్ద తమ ప్రజల నివాసాలు ఖాళీ చేయించి.. సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ఇవాళ తెల్లవారుజామున ఉక్రెయిన్ రాజధాని కీవ్, సన్నీ ప్రాంతంపై రష్యా విమానాలు బాంబు దాడులు చేశాయి. వీటిల్లో 35 ఏళ్ల ఓ వ్యక్తి, నాలుగేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.
శనివారం సాయంత్రం జెలెన్‌స్కీ ప్రసంగిస్తూ ఉక్రెయిన్ యోధులకు ధన్యవాదాలు తెలిపారు. తమ సీనియర్ మిలటరీ కమాండర్ ఒలక్సాండర్ సిరిస్కీతో చర్చించి రష్యాలో ఆపరేషన్‌కు తుదిరూపు తెచ్చినట్లు వెల్లడించారు. "ఉక్రెయిన్ న్యాయం సాధించగలదు, దురాక్రమణదారుకు సమాధానం చెప్పగలదు" అని దీంతో తేలిందన్నారు.
తాజాగా ఉక్రెయిన్ దళాలు సరిహద్దు పట్టణాన్ని స్వాధీనం చేసుకొనేంత దగ్గరగా వెళ్లాయి. ఇది రష్యా భూభాగంలో 6 మైళ్ల లోపల ఉంటుంది. ఇక్కడి నుంచి 76 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారని రష్యా ప్రభుత్వ మీడియా టాస్ పేర్కొంది. ఆ దేశ నేషనల్ కౌంటర్ టెర్రరిజం విభాగాన్ని ఇక్కడ రంగంలోకి దింపారు. కర్స్క్, బెల్గొరోడ్, బ్రియాన్స్క్ ప్రాంతాల్లో ప్రజల సంచారాన్ని, ఫోన్ల వినియోగాన్ని నిషేధించారు. దాదాపు 1,000 ఉక్రెయిన్ సైనికులు, ట్యాంకులు, ఇతర సాయుధ దళాలు మంగళవారం ఈ ప్రాంతంలోకి ప్రవేశించాయని రష్యా ఆరోపిస్తోంది.
ఉక్రెయిన్ సైనికుల దాడులతో నైరుతి రష్యాలోని కర్స్క్ ప్రాంతంలో పరిస్థితులు భీకరంగా మారుతున్నట్లు కనిపిస్తోంది. ఉద్రిక్తతల నేపథ్యంలో కర్స్క్‌లో ఆత్యయిక స్థితి విధిస్తున్నట్లు రష్యా నిన్న ప్రకటించింది. ఆ ప్రాంతంలో ఉక్రెయిన్ సైనికులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అదనపు బలగాలను తరలిస్తున్నట్లు తెలిపింది.

# అన్నదాతలకు శాపంగా తుంగభద్ర 19వ గేటు..!





**కర్నాటక (జర్నలిస్ట్ ఫైల్) :** కంచం దాకా వచ్చిన అన్నం నోటికందకుండా పోయినట్లు" అన్న చందంగా అన్నదాతల పరిస్థితి ఏర్పడింది. వరదలో కొట్టుకుపోవడంతో సాగు నీటికి ఎదురుచూస్తున్న పంట పొలాలకు తుంగభద్ర డ్యాం 19వ గేటు శాపంగా మారింది..!
గేటు మరమ్మతులు పూర్తి కావడానికి ఐదు నుండి ఆరు రోజులు సమయం పడుతుంది : మెకానికల్ ఇంజనీర్ కన్నయ్య నాయుడు
ఆంధ్ర కర్ణాటక రాష్ట్ర ప్రజల జీవనాడి తుంగభద్ర డ్యామ్ 19వ గేట్ ప్రమాదవశాత్తు కొట్టుకుపోయినట్లు తుంగభద్ర బోర్డు అధికారులు తెలిపారు. 19వ గేట్ పై ఎక్కువ ఒత్తిడి పడకుండా మరో 32 గేట్ల ద్వారా మొత్తం మీద 90 వేల క్యూసెక్కుల వరకు నీటిని నదికి విడుదల చేస్తున్నారు. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాత్రికి రాత్రి హెచ్చరికలు జారీ చేశారు. గేటు మరమ్మతులు పూర్తి కావడానికి ఐదు నుండి ఆరు రోజులు సమయం పడుతుందని మెకానికల్ ఇంజనీర్ కన్నయ్య నాయుడు తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. గతంలో ఈయన తుంగభద్ర డ్యాం గేట్లు నిర్మాణ పనులు జరిగేటప్పుడు ఇంజినీర్ గా వ్యవహరించారు. ఈయనను రాత్రి రాత్రికి హైదరాబాద్ నుండి పిలిపించి తుంగభద్ర డాం ప్రవాహం వల్ల 19వ గేట్ తెగిపోవడంతో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవచ్చు అనే విషయంలో ఒక నిర్ధారణకు వచ్చి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మరమ్మతులు పూర్తయ్యే లోపల తుంగభద్ర డ్యాం నుండి 50 టీఎంసీల వరకు నీరు దిగువ ప్రాంతాలకు వెళతాయని బోర్డు అధికారుల అంచనాకు వచ్చారు. భవిష్యత్తులో బాగా వర్షాలు కురిస్తే తప్ప డ్యాము నిండే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఇన్ ఫ్లో కూడా అంతంత మాత్రమే ఉన్నట్లు తెలుస్తుంది. ఇక రైతులకు కూడా ఒకే పంటకు సాగునీరు అందించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు లేక పండిన పంటలు నిండు ముఖం పట్టాయి. ప్రతిరోజు వరుణుని కరుణ కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు

**రైతులకు శాపంగా మారిన 19వ గేట్**

తుంగభద్ర డాం 19వ డేటు అన్నదాతలకు శాపంగా మారిందనే చెప్పవచ్చు గత రెండేళ్లుగా ఒకే పంటతో రైతులు సరిపెట్టుకున్నారు. ఈ ఏడాది కర్ణాటక రాష్ట్రంలో అధిక వర్షాలు కురవడంతో తుంగభద్ర డాం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొని వచ్చిన వరదను దిగివకు పంపడం జరిగింది. గత పది రోజులుగా ఇన్ ఫ్లో తగ్గిపోవడంతో ఉన్న నీటిని ఎల్.ఎల్.సి. హెచ్.ఎల్.సి, రాయబసవ తదితర కాలువలకు వదులుతూ మిగిలిన నీటితో రెండు పంటలు పండించుకునే అవకాశం ఎదురుగా కనపడగా ఇంతలోనే కంచం దాకా వచ్చిన అన్నం నోటి దాకా రాకుండా పోయింది అన్నట్లు 19వ గేట్ దిగిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కర్ణాటకలో మరోసారి బాగా వర్షాలు కురిసి తుంగభద్ర డ్యామ్ కు ఇన్ ఫ్లో వస్తే తప్ప రెండు పంటలు పండించుకునే అవకాశం లేదని గట్టిగా చెప్పవచ్చు.

# ఆగస్ట్ 13న తీర్పు వెల్లడిస్తాం : సిఎఎస్



**పారిస్ (జర్నలిస్ట్ ఫైల్) : :** రెజ్లర్ వినేశ్ ఫోగాట్ అప్పీల్ పై తీర్పును ఆగస్ట్ 13న వెల్లడించనున్నట్లు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సిఎఎస్) ఆదివారం ప్రకటించింది. వినేశ్ అప్పీల్ చర్చించేందుకు మరికొంత సమయం పడుతుందని, ఆగస్ట్ 13న తమ నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు సిఎఎస్ అడహక్ డివిజన్ పేర్కొంది. 100 గ్రాముల అదనపు బరువు కారణంగా వినేశ్‌ను ఫైనల్‌కు అనర్హురాలిగా ప్రకటించిన సంగతి తెలిసిందే.
ఆదివారం తీర్పు వెలువడుతుందని భారత ఒలింపిక్ సంఘం శనివారం సాయంత్రం తెలిపింది. మొదట శనివారం సాయంత్రం తీర్పు వెల్లడిస్తామని ప్రకటించిన కోర్టు చివరి క్షణంలో వాయిదా వేసింది. ఒలింపిక్స్ ముగిసేలోపు తీర్పు ప్రకటిస్తామని పేర్కొంది.
ఈ గందరగోళ పరిస్థితుల మధ్య.. వినేశ్ పోగాట్ ర ఆగస్ట్ యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ అండ్ ది ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ విషయంలో ఆగస్టు 13 సాయంత్రం 6.00 గంటల లోపు ఇవ్వాలని డా. అన్నాబెల్లె బెన్నెట్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్ట్ 11న ప్రస్తావన ఏమిటంటే.. అన్ని పార్టీలకు ఏవైనా అదనపు పత్రాల సమర్పించడానికి ఇచ్చిన సమయం అని పేర్కొన్నారు.
ఆదివారం స్టేడ్ డి ఫ్రాన్స్‌లో జరిగే వేడుకలతో పారిస్ ఒలింపిక్స్ ముగియనున్నాయి.

# అస్సాం రైఫిల్స్ ఉపసంహరణను వ్యతిరేకిస్తూ కుకీల నిరసన



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** మణిపూర్‌కి చెందిన కుకీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (కెఎస్ఒ) ఆధ్వర్యంలో విద్యార్థులు, మద్దతుదారులు స్థానిక జంతర్‌మంతర్ వద్ద భారీ నిరసన చేపట్టారు. మణిపూర్‌లోని బఫర్‌జోన్ నుండి అస్సాం రైఫిల్స్‌కు చెందిన 9వ, 22వ బెటాలియన్‌లను ఉపసంహరించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అస్సాం రైఫిల్స్ స్థానంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్)తో ఎదురయ్యే పరిణామాల గురించి ఆందోళన వ్యక్తం చేశారు.
2023 మేలో కేంద్ర హోం శాఖ సమస్యాత్మక ప్రాంతాల్లో అస్సాం రైఫిల్స్ బలగాలను నియమించిన సంగతి తెలిసిందే. మణిపూర్‌లోని సమస్యాత్మక ప్రాంతాల్లో హింసాత్మక పరిస్థితులను అదుపుచేయడంలో అస్సాం రైఫిల్స్ కీలక పాత్ర పోషించాయని కెఎస్ఒ ప్రతినిధి తెలిపారు. అయితే ఈ అస్థిర సమయంలో వారి తొలగింపు శాంతి దిశగా సాధించిన పురోగతిని కూలదోసే ప్రమాదం ఉందని, మరియు హింసాత్మక పరిస్థితులు తలెత్తే అవకాశముందని హెచ్చరించింది. మణిపూర్‌లోని సామాజిక, రాజకీయ ంస్థలతో పాటు స్థానిక సంఘాల నుండి అస్సాం రైఫిల్స్ సంపాదించిన నమ్మకాన్ని హైలెట్ చేసింది.

# వైద్యురాలిపై హత్యాచార ఘటన.. అతడో 'పోకిరీ వాలంటీర్'!




**కోల్‌కతా :** వైద్యురాలి దారుణ హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. బాధితురాలిపై లైంగిక దాడి జరిగినట్లు పోస్టుమార్టం నివేదికలో ఇప్పటికే వెల్లడైంది. కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కళాశాలలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఈ కేసులో సంజయ్ రాయ్ అనే వ్యక్తిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. అతడు పోలీసులకు అనుబంధ వాలంటీర్‌గా పనిచేస్తున్నాడని తేలింది. పోకిరి చేష్టలతో స్థానికులకు ఎప్పుడూ ఇబ్బంది కలిగించేవాడని తెలిసింది. అతడు పుట్టినప్పటి నుంచి తనకు కష్టాలు మొదలయ్యాయని నిందితుడి తల్లి చెప్పడం గమనార్హం.
దక్షిణ కోల్‌కతాలోని శంభునాథ్ పండిట్ వీధిలో ఉండే సంజయ్.. స్థానిక పోలీస్ విభాగంలో విపత్తుల నిర్వహణ బృందంలో వాలంటీర్‌గా చేరాడు. అప్పటి నుంచి ఓ పోలీసు ఉన్నతాధికారికి పీఏగా పనిచేస్తున్నానంటూ చెలామణి అయ్యేవాడు. కొందరికి మాత్రం హోంగార్డుగా పరిచయం చేసుకునేవాడు. నగరంలోని ఓ పోలీసు బెటాలియన్ వద్ద ఎక్కువగా కనిపించేవాడు. ఈ క్రమంలోనే ఆర్జీ కర్ ఆసుపత్రి చెక్‌పోస్టు వద్ద బాధ్యతలు అప్పగించారు. వాలంటీర్‌గా పనిచేస్తూనే మధ్యవర్తిగా పనిచేసేవాడని సమాచారం.

**అశ్లీలతకు బానిసై..**

పోలీసుల దర్యాప్తులో మరికొన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతడి మొబైల్‌లో అభ్యంతరకర ఫొటోలు, వీడియోలు గుర్తించిన అధికారులు.. అశ్లీలతకు బానిసై ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధరించారు. అంతేకాకుండా మహిళా సహోద్యోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తించినట్లు తేలింది. ఈ విషయాలన్నీ నిజమేనని దర్యాప్తు అధికారుల ముందు నిందితుడు అంగీకరించాడు. దర్యాప్తు సమయంలో ఎటువంటి పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోగా.. తనను ఉరితీ–యాలనుకుంటే.. తీయండి.. అంటూ ఎదురుచెప్పడం గమనార్హం.
మరోవైపు స్థానికంగానూ పోకిరీ చేష్టలతో ఇబ్బంది కలిగించేవాడని తెలిసింది. ఇదే విషయంపై నిందితుడి తల్లి స్పందిస్తూ.. సంజయ్‌కు జన్మనిచ్చినప్పటి నుంచి కష్టాలు మొదలయ్యాయని వాపోయారు. కానీ, ఇటువంటి దుశ్చర్యకు పాల్పడతాడని మాత్రం అనుకోలేదని, ఇది నమ్మశక్యంగా లేదన్నారు. ఇదిలాఉంటే, జూనియర్ వైద్యురాలి దారుణ హత్యకు నిరసనగా దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కొన్ని రకాల వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ఫోర్డా (ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్) తెలిపింది.

**12న దేశవ్యాప్తంగా వైద్య సేవల నిలిపివేత: ఫోర్డా**

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలి దారుణ హత్యపై రెసిడెంట్ డాక్టర్లు తీవ్రంగా స్పందించారు. సోమవారం దేశవ్యాప్తంగా కొన్ని రకాల వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ఫోర్డా (ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్) తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం.. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు లేఖను పంపించింది. ఆర్జీ కార్ మెడికల్ కళాశాల వైద్యులకు మద్దతుగా ఈ చర్యను చేపట్టినట్లు ప్రకటించింది.
జూనియర్ వైద్యురాలి దారుణ హత్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఫోర్డా నిన్న కేంద్రాన్ని డిమాండ్ చేసింది. ఇందుకు 24 గంటల డెడ్‌లైన్ ఇచ్చింది. లేకపోతే ఆస్పత్రుల్లో సేవలను నిలిపివేస్తామని హెచ్చరించింది. దౌర్జన్యాలకు గురైన తమ వారికి న్యాయం జరగాలని పేర్కొంది. దీనికి రాజకీయ రంగు పులిమి ప్రతికూల కోణంలో చూడొద్దని అభ్యర్థించింది. అన్ని వర్గాలు వైద్యులకు మద్దతు ఇవ్వాలని కోరింది.
పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఓ జూనియర్ వైద్యురాలు దారుణ హత్యకు గురయ్యారు. ఆమెపై లైంగిక దాడి చోటుచేసుకున్నట్లు ప్రాథమిక శవపరీక్షలో నిర్ధారణ అయింది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆ జూనియర్ వైద్యురాలు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం రాత్రి విధుల్లో ఉన్నారు. శుక్రవారం ఉదయం ఆసుపత్రి సెమినార్ హాలులో అర్ధనగ్న స్థితిలో శవమై కనిపించారు. ఆమె మర్మాంగాలు, నోరు, కళ్ల నుంచి రక్తస్రావం జరిగినట్లు శవపరీక్షలో తేలింది. శరీరంపై వివిధ చోట్ల గాయాలు కనిపించాయి. ఆమెపై హత్యాచారం జరిగినట్లు పోస్టుమార్టం ప్రాథమిక నివేదిక తేల్చింది. మరోవైపు పోలీసులు ఈ కేసులో ఇప్పటికే ఓ పౌర వాలంటీర్‌ను అరెస్టు చేశారు. హత్యా స్థలంలో దొరికన ఓ బ్లూటూత్ ఆధారంగా అతడిని అదుపులోకి తీసుకొని హంతకుడిగా నిర్ధరించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఆస్పత్రిలో ఉద్యోగుల రక్షణపై ఆందోళన వ్యక్తమవుతోంది.

## జాతీయం/అంతర్జాతీయం

## రోహింగ్యాలపై డ్రోన్ దాడి..200 మందికి పైగా మృతి..!



**మయన్మార్ (జర్నలిస్ట్ ఫైల్) :** మయన్మార్ విడిచి బంగ్లాదేశ్‌కు పారిపోతున్న రోహింగ్యాలపై డ్రోన్‌ల ద్వారా దాడులు చేశారు. ఇందులో 200 మందికి పైగా మృతి చెందినట్లు సమాచారం. రాయిటర్స్ నివేదిక ప్రకారం.. నాఫ్ నది గుండా బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించేందుకు వారు ప్రయత్నించగా వారిపై దాడి జరిగింది. బంగ్లాదేశ్ సరిహద్దులో దాడి జరిగిందని సాక్షులు చెప్పారు. ఇది రాఖైన్ రాష్ట్రంలో జరిగిన అత్యంత ఘోరమైన దాడిగా అధికారులు అభివర్ణించారు. మృతుల్లో గర్భిణీ, మహిళలు, పిల్లలు కూడా ఉన్నట్లు సమాచారం.

## బీహార్ లో నదిలో మునిగిపోయిన పడవ.. 24మంది గల్లంతు



**బీహార్ (జర్నలిస్ట్ ఫైల్) :** బీహార్‌లోని ఖగారియాలో బాగమతి నదిలో ఘోర ప్రమాదం జరిగింది. పడవ నదిలో మునిగిపోవడంతో దాదాపు 24 మంది గల్లంతయ్యారు. వీరిలో కొందరు ఈదుకుంటూ బయటకు రాగా, కొందరిని స్థానికులు రక్షించారు. అయితే ఇంకా ముగ్గురు ఆచూకీ తెలియలేదు. నదిలో గల్లంతైన వారి కోసం ఎస్డీఆర్ఎఫ్ బృందం వెతుకుతోంది. ఈ ఘటన మాన్సీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖిర్నియా ఘాట్ వద్ద చోటుచేసుకుంది. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బాంబుపేలుడులో మాజీ ఎమ్మెల్యే భార్య మృతి



**ఇంఫాల్ (జర్నలిస్ట్ ఫైల్) :** మణిపూర్‌లోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో బాంబు పేలుడు జరిగింది. ఈ ఘటనలో సైకుల్ మాజీ ఎమ్మెల్యే యమ్‌థాంగ్ హౌకిప్ భార్య మరణించారు. యమ్‌థాంగ్ హౌకిప్ నివాసం పక్కనే బాంబు పేలుడు జరిగినట్లు సైనికులు వెల్లడించారు. ఈ ఘటనలో ఆయన రెండో భార్య సపం చారుబాలా తీవ్రంగా గాయపడటంతో ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించారని అన్నారు. ఆ సమయంలో హౌకిప్ కూడా నివాసంలోనే ఉన్నాడని, అయితే ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదని చెప్పారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

## ఈరోజు నుంచి నుంచి అన్ని ఆస్పత్రుల్లో వైద్య సేవలు బంద్




**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** కోల్‌కతాలో వైద్యురాలి లైంగికదాడి ఘటనకు నిరసనగా ఈరోజు నుంచి దేశవ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో కొన్ని ఎంపిక చేసిన సేవలను నిలిపేస్తున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్(%ఖీూ=ణూ%) తెలిపింది. ఈ నిరసన నుంచి అత్యవసర సేవలను మినహాయిస్తున్నట్లు వెల్లడించింది. కోల్‌కతాలో వైద్యురాలి లైంగికదాడి ఘటనకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రి నడ్డాకు లేఖ రాసింది. నిందితుడిని శిక్షించాలని, వైద్యులకు భద్రత కల్పించాలని కోరింది.

## శంషాబాద్ ఎయిర్ పోర్టులో భారీగా బంగారం పట్టివేత




**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తున్న ఓ ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్టులో ప్రయాణికులను తనిఖీ చేస్తుండగా ఈ స్మగ్లింగ్ బయటపడింది. రూ. కోటి విలువైన 1,390 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం శంషాబాద్ ఎయిర్ పోర్టులో ల్యాండయిన ఎమిరేట్స్ విమానంలో ఓ ప్రయాణికుడు బంగారం అక్రమంగా తీసుకొచ్చాడు. బూట్ల కింద, బ్యాక్ ప్యాక్ వెనుక బంగారం దాచినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు.

## ఆర్టీసీ ఔట్సోర్సింగ్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళతా : యల్లటూరు శ్రీనివాస రాజు



**అన్నమయ్య(జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్టీసీ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ కార్మికులకు భరోసా ఇచ్చారు. ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్సోర్సింగు ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజును ఆదివారం యల్లటూరు భవన్ లో కలిసి ఆర్టీసీ అవుట్ సోర్సింగ్, ఎంప్లాయిస్ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గంగాంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు తమ సమస్యల మీద వినతిపత్రం అందజేశారు. ముందుగా యల్లటూరును శాలువాతో ఘనంగా సన్మానించి తమ సమస్యలు తెలియజేశారు. ఈ సందర్భంగా గంగాంజనేయులు యల్లటూరు శ్రీనివాస రాజు తో మాట్లాడుతూ ఆర్టీసీ కాంట్రాక్టు విధానంలో సుమారుగా 7300 మంది కార్మికులు కాంట్రాక్ట్ వ్యవస్థ థర్డ్ పార్టీ విధానంలో పనిచేస్తున్నారని, థర్డ్ పార్టీ విధానం వల్ల చాలా నష్టపోతున్నామని తెలిపారు. ఆర్టీసీలో థర్డ్‌పార్టీ విధానాన్ని రద్దు చేసి నేరుగా సంస్థ నుంచి వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అప్కాస్‌లో ఆర్టీసీని కలపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. భీమా ఆర్టీసీ ద్వారా చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన యల్లటూరు శ్రీనివాస రాజు సమస్యలను ప్రభుత్వ అధికారులతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తెలియజేసి తప్పకుండా పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ పి ఎస్ ఆర్ టీ సి అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు సోమశేఖర్ రెడ్డి, జోనల్ వర్క్‌షాప్ అధ్యక్షులు సురేష్, రాజంపేట డిపో అధ్యక్షులు కుమార్, డిపో కమిటీ సభ్యులు గోపి, ప్రసాద్, పెంచలయ్య, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# సైలేజ్ దాణా తయారీ లో మంచి ఆదాయం పొందుతున్న రైతులు





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పాడి రైతులు ఎక్కువగా పశువుల మేతపైన ఖర్చు చేస్తుంటారు. ఎందుకంటే పశువులకు మేత సంవత్సరం పొడువునా దొరకడం కష్టమవొచ్చు, దీనికి మంచి ప్రత్యామ్నాయం సైలేజ్ గడ్డి తయారీ. మేతను నిల్వ చేసి అధిక పోషకాలు జోడించే ప్రక్రియే సైలేజ్. వర్షా కాలంలో, శీతాకాలంలో పచ్చి మేతలు ఎక్కువగా లభిస్తుంది. ఇలాంటి సమయంలో మేత వృధా చేయకుండా, పుష్కలంగా లభించే మేతను వివిధ పద్ధతులలో నిల్వ చేసుకుంటే వేసవిలో కరువు సమయంలో అక్కరకు వస్తుంది. మేతను రెండు పద్ధతుల్లో నిల్వ చేసుకోవచ్చు. వాటిలో ఒకటి పచ్చి మేతను ఎండు మేత గా మార్చి నిల్వ చేసుకోవడం, రెండవది పాతర గడ్డి దీనిని సైలేజ్ గడ్డి తయారీ అంటారు. వీటిలో రైతులకు సైలేజ్ గడ్డి తయారీ కొంత అనుకూలంగా ఉంటుంది. పచ్చి మేత పుష్కలంగా ఉన్నప్పుడు దాన్ని చిన్న ముక్కలుగా కత్తిరించి, గుంతలో వేసి, గాలి చొరబడకుండా కప్పి పెట్టి, పోషక విలువలు తగ్గకుండా కాపాడుకొని, అవసర సమయాల్లో పశువులకు మేపుకునే గ్రాసాన్ని సైలేజీ గడ్డి అంటారు.

జొన్న, మొక్కజొన్న, నేపియర్, గిన్నీ గడ్డి, సజ్జ వంటి ఎక్కువ పిండి పదార్థాలు కలిగి, సుమారుగా మాంసకృత్తులు కలిగిన పశుగ్రాసాలు అనువైనవి. అంతే కాదు గుర్రపుడెక్క, చెక్కతట్టాకు, గుంతకల్లుడు ఆకు, చెట్టింటాకు లాంటి కలుపు మొక్కలను కూడా సైలేజీకి వాడవచ్చు. సైలేజీ గడ్డిలో ఎండు గడ్డిని కూడా 1:4 నిష్పత్తిలో వాడవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక టన్ను పశుగ్రాసానికి సుమారు 30 కిలోల మొలాసిస్ వాడితే మంచిది. సైలేజీ తయారీకి వాడే గుంతలు 3 రకాలు.. అపార్ట్‌మెంట్ పద్ధతి, గుంత కాల్వ పద్ధతి, బంకర్ పద్ధతి. రైతు తన అవసరాన్ని బట్టి సైలేజీని తయారు చేసుకోవచ్చు. సైలేజీ తయారీకి వాడే గుంత ముఖ్యంగా పశువుల సంఖ్య, నేల స్వభావం మీద ఆధారపడి ఉంటుంది. సైలేజ్ తయారీకి ఎంచుకున్న పశుగ్రాసాన్ని పూత దశ వరకు పెరగనివ్వాలి. తర్వాత పశుగ్రాసాన్ని కోసి పొలంలోనే ఎండ బెట్టాలి. తేమ బాగా తగ్గే వరకు లేత ఎండలో ఆరనివ్వాలి. ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు పశుగ్రాసాన్ని తిప్పుతూ ఉండాలి. గుంట అడుగు భాగాన, చుట్టూ, సిమెంట్ పూత పూయాలి లేదా కనీసం పాలిథిన్ షీట్ తో లేదా పొడి గడ్డితో కప్పాలి. దీనివల్ల మట్టి పెళ్లలు విరిగి సైలేజ్‌లో కలిసి పాడవ్వకుండా నివారించవచ్చు. ఎండిన మేతను చిన్న ముక్కలుగా కత్తిరించాలి. కత్తిరించిన మేతను పాతరలో నింపాలి. ఇలా నింపేటప్పుడు గాలి లేకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఉదయపు వేళ ఈ పని ప్రారంభించటం మంచిది. గుంటలో పొరలు పొరలుగా మేత పేరుస్తూ, గాలి చేరకుండా అదుముతూ ఉండాలి. గాలి చేరితే మేత బూజు పట్టి చెడిపోతుంది.

సైలేజ్ చాలా పోషకమైనది. పశువులకు ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. ఎండుగడ్డిని నిల్వ చేయడం కంటే సైలేజ్‌నునిల్వ చేయడం చాలా సులభం, ఎందుకంటేదీనికి తక్కువ స్థలం అవసరం. పశువులకు సైలేజ్‌తో ఆహారం ఇస్తే అది అధిక పాల ఉత్పత్తినిఇస్తుంది అంతేకాదు ఆరోగ్యంగా ఉంటుంది. సైలేజ్ గడ్డిని ఒక్కొక్క పశువుకు రోజుకు 20 కిలోలు ఇవ్వవచ్చు. పచ్చిమేత ఒక భాగం, ఎండు మేత ఒక భాగం కలిపి మేపుకుంటే మంచిది. పశువులు ఇష్టంగా తింటాయి

## ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి



- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్
- రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి వినతి

**విజయనగరంటౌన్ (జర్నలిస్ట్ ఫైల్) :** ఫేస్ యాప్ అమలును రద్దు చేయాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యునియన్ నాయకులు మాట్లాడుతూ.. ఫేస్ యాప్ అమలుకు విజయనగరం, గంట్యాడ ప్రాజెక్టులను పైలాట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని తెలిపారు. దీని అమలు అనేక ఇబ్బందులతో కూడి ఉందన్నారు. ఈ పైలెట్ ప్రాజెక్టు కింద 7 నెలల నుండి మూడు సంవత్సరాలు, మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు ఫేస్ యాప్ చేసి వాళ్లకి ఓటిపి వచ్చిన తర్వాత అది సక్సెస్ అయితే వాళ్లకి స్టాకులు ఇవ్వాలని తెలిపారు. ఒక్కొక్క సెంటర్లో 70 నుంచి 80 మంది వరకు మొత్తం లబ్ధిదారులు ఉంటారని.. ముందు రోజు ఫేస్ యాప్ చేసి.. గ్రీన్ టిక్ వస్తే మరుసటి రోజు స్టాకు ఇవ్వాలని తెలిపారు. ఇది కష్టతరమైన పని అని దీనిని వెంటనే వెనక్కితీసుకోవాలని కోరారు. మంత్రి స్పందిస్తూ ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం ఉమామహేశ్వరి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. పైడ్రాజు, ఎస్. అనసూయ, జిల్లా గౌరవాధ్యక్షులు వి. లక్ష్మి, కే. ప్రభ, పి. కుమారి, చిట్టి తల్లి, సిఐటియు నాయకులు ఎన్. వై. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకల పెంపకదారులను ప్రభుత్వమే ఆదుకోవాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి
- గొర్రెలు, మేకలుకు ఇన్సూరెన్స్ లు చేయించుకోవాలి : ఎమ్మెల్యే కొండయ్య



**చీరాల (జర్నలిస్ట్ ఫైల్) :** లక్షల రూపాయలతో గొర్రలు, మేకలు కొనుగోలు చేసే పెంపకం దారులు వాటికి ఇన్సూరెన్స్ చేయించినట్లయితే ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు వచ్చే ఇన్సూరెన్స్ నగదు ఆ పెంపకదారులకు ఆసరాగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. పట్టణంలోని స్థానిక అంబేద్కర్ భవనంలో ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకలు పెంపకదారుల సంఘం జిల్లా ప్రథమ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట తిరుపతిరావు, జిల్లా నాయకులు గంగయ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య, ఎం వసంతరావు, ఎన్ బాబురావులు పలువురు సభలలో మాట్లాడారు. రాష్ట్రంలో గొర్రెల మేకల పెంపకం దారులు లక్షలాది కుటుంబాలు వృత్తిపై ఆధారపడి బతుకుతున్నాయని వేలాది మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నదని ప్రభుత్వానికి వందలాది కోట్ల రూపాయలు ఈ వృత్తి నుండి ఆదాయం వస్తున్నా ఏ ప్రభుత్వం వచ్చినా వీరు సంక్షేమానికి నిధులు కేటాయింపులు తగినంతగా కేటాయించకపోవడం వలన వృత్తిదార్లు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వర్షాలు సీజన్ ప్రారంభం అయినందున అన్ని గ్రామాలలో మూతి జబ్బులు, కాలు కుంటు వ్యాధులు తగులుతున్నాయని వీటి నివారణ కోసం అన్ని పశువుల హాస్పిటల్ లో తగినన్ని మందులు అందుబాటులో ఉంచి వైద్యం సౌకర్యం అందించి జీవాలను కాపాడాలని ఆయన కోరారు. ప్రధానంగా మేత , నీళ్లు, వైద్యం, ఇన్సూరెన్స్ , రుణాలు, సమస్యలు ఉన్నాయని వీటిని పరిష్కరించడం ద్వారానే వృత్తి మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని ప్రభుత్వం వృత్తి రక్షణ వృత్తిదారుల సంక్షేమ కోసం రాబోయే బడ్జెట్లో 10వేల కోట్లు నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే 50 సంవత్సరాలకే పెన్షన్ సౌకర్యం కల్పించాలని, 90 శాతం సబ్సిడీతో షెడ్లు ఏర్పాటు చేయాలని, 50 శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని వారు కోరారు. ముందుగా అంబేద్కర్ విగ్రహంకు పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం సభను ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, పలువురు పాల్గొన్నారు.

## తిరుమలలో పెరిగిన యాత్రికుల రద్దీ



**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్) :** తిరుమలలో పెరిగిన యాత్రికుల రద్దీ పెరిగింది. టోకెన్ లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. అన్ని కంపార్ట్ మెంట్లు నిండి యాత్రికులు బయట క్యూలైన్లలో వేచి ఉన్నారు. నిన్న శ్రీవారిని 79,313 మంది యాత్రికులు దర్శించుకున్నారు. హుండీ ఆదాయం రూ. 3.65కోట్లు వచ్చినట్లు టిటిడి అధికారులు తెలిపారు.

## గ్రంథాలయంలో ' చదవడం మాకిష్టం' కార్యక్రమం



**గుంటూరు, పెదకాకాని ( జర్నలిస్ట్ ఫైల్):** పెదకాకాని శాఖ గ్రంథాలలో ఆదివారం ఏకా గ్రంథాల అధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ' చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా 78వ స్వతంత్ర దినోత్సవ పురస్కరించుకొని ముందుగా కార్ కార్ హార్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా దేశభక్తి గేయాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే దేశభక్తిని పెంపొందించేలా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్నాడులో వరుస రైలు దొంగతనాలు



**పల్నాడు(జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లాలో వరుసగా జరుగుతున్నాయి. తెల్లవారు జామున మూడు గంటల ప్రాంతంలో పిడుగురాళ్ల మండలం తుమ్మల చెరువు వద్ద చెన్నై ఎక్స్ ప్రెస్ చైన్ లాగి మరి దోపిడీకి దుండగులు పాల్పడ్డారు. నిద్రిస్తున్న ముగ్గురు మహిళా ప్రయాణికుల మెడలో బంగారం లాక్కొని అక్కడ నుంచి ఉడాయించారు. దాంతో బాధితులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన మరవకముందే ఈ రోజు పల్నాడు ప్రాంతంలో చోటు చేసుకుంది. నడికుడి ప్రాంతంలో రైల్వే స్టేషన్ కు సమీపంలోనే నర్సాపూర్ ఎక్స్ ప్రెస్ పై దోపిడీ దొంగలు రాళ్ళతో దాడి చేశారు. ట్రైన్ చైన్ లాగిన దుండగులు ఎస్ 11, ఎస్ 12 కోచ్ లోపలికి ప్రవేశించేందుకు ట్రై చేశారు. కానీ, రైలు కోచ్, డోర్లు, విండోలు కూడా మూసి ఉండటంతో దోపిడీ దొంగల ప్రయత్నం ఫలించలేదు. ఈ నేపథ్యంలో పల్నాడు ప్రాంతంలో వరుసగా జరుగుతున్న రైలు దోపిడీ వ్యవహారాలు ప్రయాణికులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

## రేఖపల్లిలోని వరద బాధితుల పునరావాస కేంద్రాలు ఖాళీ



**అల్లూరి (జర్నలిస్ట్ ఫైల్):** మండలంలోని శబరి గోదావరి వరదలతో ఊళ్లలోకి నీళ్లు చేరడంతో దాదాపుగా పక్షం రోజులపాటు పునరావాస కేంద్రాల్లో గడిపిన జనం ప్రస్తుతం పూర్తిగా ఇళ్లకు చేరుకున్నారు. దీంతో మూడు రోజుల క్రితం జనంతో కళకళలాడిన రేఖపల్లి లోని పునరావాస కేంద్రాలు ఆదివారం నిర్మామూలంగా మారాయి. గత నెల 22వ తేదీ నుంచి ప్రారంభ మైన గోదావరి వరదలతో జనం గ్రామాలు వదిలి, అధికా రులు చూపించిన మెరక ప్రాంతాల్లో టార్పలిన్లతో గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. మూడు రోజుల క్రితం వరకు వాటి లోనే తలదాచుకున్నారు. వరదలు తగ్గడం, తమ ఇళ్లు శుభ్రం చేసుకోవడంతో ప్రజలంతా తమ సామగ్రితో గ్రామాలకు వెళ్ళి పోయారు. పునరావాస కేంద్రాల్లో ఏర్పాటు చేసుకున్న టార్ప లిన్లు తీసుకుని వెళ్లిపోవడంతో, రేఖపల్లి సచివాలయం కార్యా లయం చుట్టూ కట్టెల పందిళ్లు మాత్రం మిగిలాయి. పునరావాస కేంద్రాల వద్ద మిగిలిన పాకలు. వరద బాధితులకు వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ వాసులకు వరద నష్టపరిహారం 3, వేల రూపాయలు కొన్ని కుటుంబాలకు అందలేదని మేము వరదలకు సామాగ్రిని తీసుకు వెళ్లడానికి తీసుకురావడానికి ఐదు వేల రూపాయలు నుండి 8, వేల రూపాయలు ఖర్చుఅయిందని ఒకపక్క వరదలు మరోపక్క వర్షాలు తో గుడారాలు వేసుకొని నరకం అనుభవించామని ప్రభుత్వం మాకు రేపు మాపో ఇస్తామని మభ్యపెట్టి ఇవ్వకుండా వెళ్లిపోయారని వరద బాధితులు ఆవేదన వ్యక్తం, ఇక్కడ లేనివారికి ఆర్థిక సహాయం ఇచ్చారని ఇక్కడ మేము వరదలకు నరకం అనుభవించిన మాకు ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే ప్రభుత్వం గ్రామాలను పరిశీలించి మాకు రావలసిన ఆర్థిక సహాయం ఇవ్వాలని అధికారులను డిమాండ్ చేశారు.

## శివాలయంలో అన్నదానం

**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల అమావాస్య తర్వాత జరిగే అన్నదాన కార్యక్రమం ఆదివారం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి మాట్లాడుతూ భక్తుల సహకారంతో ప్రతి నెలలో అమావాస్య తర్వాత వచ్చే ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల కోటేశ్వరరావు, పురోహితులు టి శ్యామ సుందర శాస్త్రి, ట్రస్ట్ ప్రతినిధులు కర్నాటి శివ సత్యనారాయణ, కాగ్గా శ్రీను, జూట్రు ఏడుకొండలు, అన్నపరెడ్డి రామకృష్ణారెడ్డి, నాగరాజు, వాసు, గాయత్రి పరివార్ ప్రతినిధి పేర్ల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## జి. ఓ. 117 రద్దు చేసి పాత పద్ధతిలో 1 నుండి 5 తరగతులను సవరించాలి: ఉమా

**కడప ( జర్నలిస్ట్ ఫైల్ ):** జి. ఓ. 117 ను రద్దు చేసి 1 నుండి 5 తరగతులను పాత పద్ధతిలో సవరించి, ఎస్. జి. టీ. ఖాళీలను భర్తీ చేయాలని, 9, 10 తరగతుల ఉర్దూ లాంగ్వేజ్ పాత సిలబస్ ను అమలుచేయడానికి అనుమతి ఇచ్చి, ఈ సంవత్సరం పరీక్షలు నిర్వహించి, వచ్చే సంవత్సరానికి ఎస్. సి. ఇ. ఆర్. టీ. ద్వారా పుస్తకాలను ముద్రించేందుకు చర్యలు తీసుకోవాలని యునైటెడ్ మైనారిటీ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఉమా) కడప శాఖ ఎగ్జిక్యూటివ్ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. సమావేశం వివరాలు

శనివారం జి. ఎం. మ్యారేజ్ హాల్‌లో ఉమా కడప శాఖ ఎగ్జిక్యూటివ్ సభ్యుల సమావేశం గౌరవ అధ్యక్షులు మహబూబ్ భాషా ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మహబూబ్ ఖాన్, కామ్రేడ్ యాసిన్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగుల ఎ. పి. జి. ఎల్. ఐ. మరియు పి. ఎఫ్. జమ ఖాతాల నుండి బకాయిలను సకాలంలో చెల్లించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

ఈ సమావేశంలో సుకుమార్, అల్లబక్ష్, ముబారక్ అలీ, జీలాన్ బాషా, రఖీబ్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సంస్థల్లో ఇంజినీర్ల కొరత

- ఐదేళ్ల నుంచి లేని నియామకాలు
- ఉన్న వారిపైనే పనిభారం



**అమరావతి బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యుత్ సంస్థల్లో ఇంజినీర్ల కొరత వేధిస్తోంది. ఏటా ఉద్యోగ విరమణ చేస్తున్న పోస్టుల్లో కొత్త నియామకాలు చేసేందుకు ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు ముందుకు రావడం లేదు. దీంతో ఉన్న ఇంజినీర్లపైనే పనిభారం పడుతోంది. ఆరేళ్లుగా ఒక్క ఇంజినీరింగ్ పోస్టుకు కూడా నోటిఫికేషన్ విడుదల కాలేదు. విద్యుత్ సంస్థల్లో ఇంజినీర్ల నియామకం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎఇఇ) స్థాయి నుంచి ఉంటుంది. ఇక్కడ నుంచి ఉద్యోగోన్నతులు పొందుతారు. మొత్తం మూడు విద్యుత్ సంస్థల్లో మంజూరు పోస్టులు సుమారు 7,500 ఉంటే 5 వేలలోపు మాత్రమే సిబ్బంది పనిచేస్తున్నారు. 2,500 పోస్టుల వరకు ఖాళీలు ఉన్నాయి. జెన్‌కోలో 80 పోస్టులతో 2017లో చివరిసారి నియామకాలు జరిగాయి. ట్రాన్స్‌కోలో 170 పోస్టులకు, డిస్కంలలో 20 పోస్టులకు 2019లో చివరి నియామకాలు జరిగాయి. ఆ తరువాత ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. నెల్లూరులోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్‌డిఎస్‌టిపిపి) మూడో యూనిట్‌కు, కడపలోని రాయలసీమ థర్మల్ విద్యుత్ ప్లాంట్ (ఆర్‌టిపిపి)లోని 600 మెగావాట్ల యూనిట్‌కు ఇప్పటి వరకు సిబ్బందిని మంజూరు చేయలేదు. ఇతర యూనిట్లలో ఉన్న సిబ్బందినే జెన్‌కో ఉపయోగిస్తోంది. అదే విధంగా విజయవాడలోని నార్ల తాతారావు థర్మల్ పవర్ ప్లాంట్(ఎన్‌టిపిపి)లో 800 మెగావాట్ల యూనిట్ ఇటీవల ప్రారంభమైంది. దీనికి కూడా సిబ్బందిని మంజూరు చేయలేదు. నియామకం లేకపోవడంతో ఉన్నవారికే ఇన్‌ఛార్జులుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. డిస్కంలలో ఒక్క సర్కిల్ చూడాల్సిన ఎఇ అదనంగా రెండు సర్కిళ్లను చూస్తున్న పరిస్థితి నెలకొంది. జెన్‌కో, ట్రాన్స్‌కోలో కూడా ఒక విభాగం చూడాల్సిన ఉద్యోగి అదనంగా మరో విభాగం చూడాల్సి వస్తోంది. పోస్టుల భర్తీ కోసం విద్యుత్ సంస్థలు ఆయా బోర్డు సమావేశాల్లో తీర్మానం చేసుకుని ప్రభుత్వానికి పంపాలి. అయితే ఇప్పటి వరకు జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కం యాజమాన్యాలు ఇలాంటి ప్రతిపాదనలు పంపలేదు. పై స్థాయిలో ఉద్యోగ విరమణ చేయడంతో ఎఇఇ కేడర్ ఉద్యోగి ఉద్యోగోన్నతి పొందుతున్నారు. ఉద్యోగోన్నతి ద్వారా ఖాళీ అయిన పోస్టులను యాజమాన్యాలు అలానే వదిలేస్తున్నాయి. ఇటీవల విద్యుత్ సంస్థల్లో సుమారు 500 మంది ఉద్యోగులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. తమపై పని ఒత్తిడి తీవ్రంగా ఉందని, పోస్టులు భర్తీ చేయాలని ఉద్యోగులు ప్రభుత్వానికి, విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు పలుసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. టిడిపి కూటమి ప్రభుత్వంలోనైనా పోస్టుల భర్తీ చేయాలని ఇంజినీర్లు కోరుతున్నారు. ఈ అంశంపై విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఎపిఎస్‌ఇబి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఇటీవల వినతిపత్రం అందజేసింది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో తమపై తీవ్రమైన పని భారం పడుతుందని తెలిపారు. ఇది విద్యుత్ సంస్థలతోపాటు వినియోగ దారులపైనా ప్రభావం చూపుతుందని వివరించారు.

**లక్షల్లో ఇంజినీరింగ్ నిరుద్యోగులు**

ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు విద్యుత్ సంస్థల్లో పనిచేసేందుకు అర్హులు. ఈ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు ఉద్యోగాలు లేక లక్షల మంది ఖాళీగా ఉన్నారు. విద్యుత్ సంస్థల్లో పోస్టుల భర్తీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు.

# అసన్‌సోల్ -వరంగల్ కొత్త రైల్వే కారిడార్

● పాండురంగాపురం- భద్రాచలం- మల్కాన్‌గిరి మధ్య కొత్త రైల్వేలైను :కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

**జర్నలిస్ట్ ఫైల్** / హైదరాబాద్ : పాండురంగాపురం – భద్రాచలం – మల్కన్గిరి కొత్త రైలు మార్గాన్ని నిర్మించనున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ ప్రాజక్టు వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఎంతో మేలు చేకూరనుందని తెలిపారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ నూతన రైల్వే లైన్ ప్రాజెక్టుల మంజూరుపై కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని శనివారం మీడియాకు వివరించారు. హైదరాబాద్ మీడియాతో వర్చువల్‌గా సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగిన వర్చువల్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. అత్యంత ప్రాధాన్యతతో చేపట్టిన పాండురంగాపురం – భద్రాచలం – మల్కన్గిరి కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టును గిరిజన ప్రాంతాల ద్వారా నూతన రైలు మార్గాన్నిఅందిస్తూ అసన్సోల్, వరంగల్ మధ్య ప్రత్యామ్నాయ రైలు మార్గంగా వ్యవహరిస్తామని మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ జునాగర్హ – నబరంగ్పూర్ – జీపూర్ – మల్కన్గిరి – భద్రాచలం – పాండురంగాపురం మధ్య అనుసంధానంగా ఉంటుందన్నారు. ఈ కొత్త రైలు మార్గం జునాగఢ్– నబరంగ్పూర్, మల్కన్గిరి– భద్రాచలం – పాండురంగాపురం మధ్య 290 రూట్ కిలోమీటర్ల మేర రూ.7,383 కోట్ల వ్యయంతో చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఎంతో ప్రయోజనం పొందుతాయని కూడా పేర్కొన్నారు. ఇది ఉత్తర, తూర్పు భారతదేశానికి అదనపు రైలు కారిడార్ అవుతుందని, దక్షిణ భారతదేశంలోని థర్మల్ పవర్ ప్లాంట్లకు బొగ్గును వేగంగా చేరవేయడానికి, అల్యూమినియం, ఇనుప ఖనిజ పరిశ్రమలకు మెరుగైన అనుసంధానాన్ని కల్పించడం లో ప్రయోజనకారిగా సహాయపడుతుందని తెలిపారు. ఈ కొత్త లైన్ ఆంధ్ర, తెలంగాణలలో వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత మార్కెట్‌ను అందిస్తుందన్నారు. ఇది ఇప్పటికే ఉన్న విజయవాడ – విశాఖపట్నం – భువనేశ్వర్ – కోల్‌కతా కోస్తా తీరప్రాంతానికి నూతనంగా నిర్మిస్తున్న వరంగల్ – భద్రాచలం– మల్కన్గిరి– జయ్‌పూర్ – టిట్లాగఢ్‌కు అదనపు రైలు మార్గాన్ని అందిస్తుందని తెలిపారు. గతంలో వామపక్ష తీవ్రవాదానికి ప్రభావితమైన కలహండి , నబరంగ్పూర్ , కోరాపుట్ , రాయగడ , మల్కన్గిరి గిరిజన జిల్లాలకు ఈ లైన్ అనుసంధానాన్ని అందిస్తుంది. ప్రస్తుతం ఈ జిల్లాల్లో ఆర్థిక కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. శాంతి పునరుద్ధరణ జరుగుతోంది. ఈ కొత్త లైన్ కారిడార్ పైన పేర్కొన్న ఒడిశా, తూర్పు గోదావరి (ఆంధ్రప్రదేశ్), భద్రాద్రి కొత్తగూడెం (తెలంగాణ) జిల్లాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తుంది. ఈ కారిడార్ మహానది బొగ్గు క్షేత్ర ప్రాంతాల నుండి మధ్య, దక్షిణ భారతదేశంలో ఉన్న పవర్ ప్లాంట్లకు త్వరిత అనుసంధానాన్ని అందిస్తుంది. కొత్త రైల్వే లైన్ విపత్తుల సమయంలో ప్రత్యామ్నాయ రైలు మార్గంగా ఉపయోగపడుతుందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. తుఫానుల సమయంలో హౌరా–విజయవాడ తీర మార్గంలో ప్రస్తుతం ఉన్న మార్గాల అనుసంధానం దెబ్బతింటే ఈ ప్రత్యామ్నాయ కొత్త రైల్వే లైన్ ఒడిశాలోని వివిధ జిల్లాలకు అనుసంధానాన్ని అందిస్తుంది. ఇది ఈ ప్రాంతానికి ఆహార ధాన్యాలు, ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తులు, సిమెంటును సులభంగా అందించేందుకు కూడా ఉపయోగపడుతోంది. ఈ కొత్త రైల్వే లైన్ ద్వారా బస్తర్ ప్రాంతం నుండి దక్షిణ భారతదేశానికి 124 కి.మీ దూరం తగ్గుతుంది, రాజమండ్రి, విశాఖపట్నం వంటి రద్దీ కారిడార్‌లను దాటవేస్తూ ప్రత్యామ్నాయ మార్గంగా కూడా పని చేస్తుంది. ఈ ప్రాజెక్ట్ 1 కోటి పనిదినాల ఉపాధిని సృష్టిస్తుంది. 3 కోట్ల 80 లక్షల చెట్ల పెంపకానికి సమానమైన 267 కోట్ల కిలోల కార్బన్ ఉద్గారాలను తగ్గిస్తుంది.




## సుంకేశుల డ్యామ్ ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తు

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్



**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్: సుంకేశుల డ్యామ్ కూలిన ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరగాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. తాను ఈ సంఘటన గురించి పత్రికల్లో చదివానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు అవసరమైన ఈ డ్యామ్ కూలడం చాలా విచారకరమని అన్నారు. బిఆర్ఎస్ విలీనంపై బిజెపిలో ఎటువంటి సంప్రదింపులు లేవని అన్నారు. అలాగే రాష్ట్ర బిజెపి అధ్యక్షుడి మార్పు అంశం పార్టీ అధిష్టానం చూసుకుంటుందని అన్నారు. జమ్మూకశ్మీర్‌లో ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతాయని అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుందని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పాక్ ఉగ్రవాదులు శాంతియుత పరిస్థితులు చెడగొట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం ఎన్నికల సంఘం జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉందని అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ ఇచ్చిన 'ఏక్ పేడ్ మాకే నామ్' పిలుపు మేరకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి శనివారం డిల్లీ లోని తన నివాసంలో తన మాతృమూర్తి పేరిట ఓ మొక్కను నాటారు. ప్రతి ఒక్కరూ ఈ స్ఫూర్తితో మొక్కలు నాటుతూ అమ్మను గౌరవించుకోవాలని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా సూచించారు. మొక్క నాటిన అనంతరం మంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ అమ్మ పేరుతో మొక్క నాటాలని, చెట్లు పెంచాలన్న ప్రధాని పిలుపు మేరకు దేశవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతుందన్నారు. మన జీవితంలో అమ్మ తర్వాతే అన్ని కాబట్టి అమ్మ నవమాసాలు మోసి పెంచిన అమ్మకు జ్ఞాపకంగా గుర్తుగా అమ్మ గౌరవనికి గుర్తుగా ప్రతి ఒక వ్యక్తి చెట్టు నాటలని, అమ్మ గౌరవాన్ని పెంచాలన్నది ప్రధాని మోదీ గారి ఆలోచన అన్నారు. పర్యావరణ పరిరక్షణకు అమ్మ ప్రేరణ కావాలని అన్నారు. అమ్మే ఒక స్ఫూర్తి కావాలన్నది మోదీ ఆకాంక్ష కాబట్టి అందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.



## మంత్రి రాజనర్సింహతో గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ భేటీ

**జర్నలిస్ట్ ఫైల్** / హైదరాబాద్ : రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రాజకుమారి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ పాల్గొన్నారు.

## ఏడుపాయల ఆలయంలో చోరీ



**జర్నలిస్ట్ ఫైల్** /పాపన్నపేట: మెదక్ జిల్లా, పాపన్నపేట మండలం, ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో చోరీ జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి పన్నెండున్నర గంటల సమయంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఆలయ మండపానికి ఉన్న గేటును ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. మండపంలో ఉన్న రెండు హుండీలను ఎత్తుకెళ్లారు. ఆలయానికి కొంత దూరంలో ఉన్న చెట్ల పొద ల వద్దకు వాటిని తీసుకువెళ్లి రెండు హుండీల తాళాలు పగలగొట్టి వాటిలో ఉన్న రూ.3 వేలు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు వచ్చి ఆధారాలు సేకరించారు. ఆలయ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

## మద్యం మత్తులో కన్నతండ్రిని చంపిన కిరాతకుడు



**జర్నలిస్ట్ ఫైల్** /తెలకపల్లి: జులాయిగా తిరుగుతూ మద్యం మత్తులో పడి కన్నతండ్రిని అతి కిరాతకంగా హత్య చేసిన కసాయి కొడుకు సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ బి నరేష్ అందించిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గట్టునెల్లికుదురు గ్రామానికి చెందిన బింగి మల్లేష్ చెడువ్యసనాలకు, మద్యానికి బానిసై ఎటువంటి బాధ్యత లేకుండా, ఏ పని చేయకుండా జులాయిగా తిరుతున్నాడు. శుక్రవారం రాత్రి తండ్రి బింగి సుల్తాన్.. మద్యం మానాలని బాధ్యతగా పనిచేసుకోవాలని కొడుకును మందలించాడు. కానీ అప్పటికే మద్యం మత్తులో ఉన్న మల్లేష్ మంచంపై నిద్రిస్తున్న తండ్రి బింగి సుల్తాన్ (52)పై అతి కిరాతకంగా గొడ్డలితో ఎదపైన, గొంతుపైన నరికి చంపాడు. మృతుని భార్య బింగి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కన్నతండ్రిని హత్య చేసిన కసాయి కొడుకును కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## మేఘా కృష్ణారెడ్డిని ప్రభుత్వం కాపాడాలని చూస్తోంది

సుంకేశుల బ్యారేజ్ కూలిన ఎందుకు స్పందించలేదు?

బీజేఎల్పీ నేత ఏలేటి సంచలన వ్యాఖ్యలు

**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్: సుంకేశుల బ్యారేజ్ కూలి పది రోజులు అయినా ప్రభుత్వం దృష్టికి రాలేదా?, ఒకవేళ ప్రభుత్వం దృష్టికి వచ్చినా.. మేఘా కృష్ణారెడ్డిని కాపాడుకునేందుకు అసలు విషయాన్ని దాచారా? అని రాష్ట్ర ప్రభుత్వంపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఏలేటి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మారినా పెత్తనం మాత్రం మేఘాకృష్ణారెడ్డిదే అన్నారు. గవర్నమెంట్ మారినా కాంట్రాక్టర్ మారడా? అని ప్రశ్నించారు. నాసిరకం పనులు చేసిన ఆయనకే మళ్లీ కాంట్రాక్టులు ఇస్తున్నారని ఆరోపించారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. నాసిరకం పనులు చేసి గుత్తేదార్లను కాపాడుతున్నారని ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మేఘాను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. గతంలో సుంకేశుల అంచనా వ్యయం రూ.800 కోట్లు అని కానీ, మేఘా కృష్ణారెడ్డి దానిని రూ.4 వేల కోట్లకు పెంచారని తీవ్ర ఆరోపణలు చేశారు. క్రిమినల్ కాంట్రాక్టర్లకు వేల కోట్లు దోచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు మేఘా మీద చర్యలు ఎందుకు లేవు? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో కూడా పీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి అనేక ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడెందుకు కాళేశ్వరం అవినీతిని సీబీఐకి సిఫార్సు చేయడం లేదని నిలదీశారు. దాని మీద రిటైర్డ్ జడ్జి కమిటీ వేశారని గుర్తుచేశారు. జడ్జికి 3 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని, ప్రభుత్వం ఆయనకి కీలకమైన ఫైల్స్ కూడా ఇవ్వడం లేదని అన్నారు. కమిటీని ప్రభుత్వమే నీరు గార్చే పనిలో ఉందని ఏలేటి అనుమానం వ్యక్తం చేశారు. మేఘా మీద ఉన్న ఆరోపణలపై సీబీఐ ఎంక్వైరీకి సిఫార్సు చేయాలని డిమాండ్ చేశారు. మేఘాది ఒక క్రిమినల్ కంపెనీ అని చెప్పడానికి నా దగ్గర ఆధారాలు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆధారాలు ఎక్కడ సమర్పించాలంటే అక్కడ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.

## కొత్త అంగన్వాడీ కేంద్రాలు కావాలి

కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన మంత్రి సీతక్క

సానుకూలంగా స్పందించిన కేంద్రం

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతాల్లో కొత్త అంగన్వాడీ కేంద్రాలను మంజూరు చేయాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీ సెంటర్లలో మెరుగైన సేవలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక సహకారాన్ని పెంచాలని కోరారు. దేశంలోని అన్ని రాష్ట్రాల మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రులతో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్న పూర్ణాదేవి శనివారం నాడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా రాష్ట్రాల్లోని మహిళా శిశు సంక్షేమ శాఖలో అమలవుతున్న పథకాలు, ఎదురవుతున్న సవాళ్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సచివాలయం నుంచి వీడి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సీతక్క, తెలంగాణలో అమలవుతున్న ప్రత్యేక సంక్షేమ పథకాలను వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అవసరాలను కేంద్రం ముందుంచారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కొత్త అంగన్వాడీ సెంటర్లను మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్లు వినియోగిస్తున్న మొబైల్ ఫోన్ల స్థానంలో ట్యాబ్‌లు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,700 అంగన్వాడీ కేంద్రాల్లో ఏడు నెలల నుంచి 6 సంవత్సరాల మధ్య వయసు ఉన్న 14, 83, 940 చిన్నారులకు, 3,45,458 మంది గర్భిణీ, బాలింతలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. 3989 మిని అంగన్వాడీ మెయిన్ అంగన్వాడీ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేసినట్లు చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో నర్సరీ క్లాస్‌లను త్వరలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ పూర్తి చేసినట్లు మంత్రి సీతక్క చెప్పుకొచ్చారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా అంగన్వాడీ చిన్నారులకు రంగు రంగుల యూనిఫాంలు ఇవ్వబోతున్నట్లు తెలిపారు.అంగన్వాడీ కేంద్రాల్లో బుక్ ర్యాక్స్, చౌకీలు, ప్లేయిన్ మాట్స్ తదితర మౌళిక సదుపాయలను అందిస్తున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

సీతక్క ప్రతిపాదనలకు కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవి సానుకూలంగా స్పందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోరిన విధంగా కొత్త అంగన్వాడీ సెంటర్ల మంజూరుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. మినిఅంగన్వాడీ సెంటర్లను మెయిన్ అంగన్ వాడి సెంటర్లుగా తెలంగాణలో అప్ గ్రేడ్ చేయడాన్ని కేంద్ర మంత్రి అభినందించారు. మరిన్ని మినిసెంటర్లను అప్ గ్రేడ్ చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. తమ ప్రతిపాదలకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రికి రాష్ట్ర మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.

# బిరబిరా కృష్ణమ్మ

● సాగర్ జలాశయానికి కొనసాగుతున్న వరద ● నాలుగు రోజుల నుండి వరుసగా 26 రేడియల్ క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీరు విడుదల ● జాలీ ట్రిప్పులు తిరిగే లాంచీలు బంద్

**జర్నలిస్ట్ ఫైల్**/నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో పర్యాటకుల సందడితో పండుగ వాతావరణం నెలకొంది. గత నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా కనువిందులు చేస్తోంది. ఎగువ నుండి భారీగా వరద ప్రవాహం పెరగడంతో పరుగులు పెడుతూ కృష్ణమ్మ నాగార్జునసాగర్ జలాశయానికి చేరుకుంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల జూరాల, శ్రీశైలం నుండి నాగార్జునసాగర్ జలాశయానికి భారీగా వరద నీరు చేయడంతో నాలుగు రోజుల నుండి వరుసగా 26 రేడియల్ క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కృష్ణా పరీవాహక ప్రాంతమంతా జలకళతో కళకళలాడుతోంది. బిరబిరా కృష్ణమ్మ పరుగులు పెడుతూ నాగార్జునసాగర్ జలాశయానికి చేరుతోంది. డ్యాం గేట్ల ద్వారా పడుతున్న కృష్ణమ్మ సోయగాలను పర్యాటకులు సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు. కృష్ణమ్మ అందాలను వీక్షించేందుకు పర్యాటకులు తండోపతండాలుగా వివిధ రాష్ట్రాల నుండి నాగార్జునసాగర్‌కు చేరుతున్నారు. సాగర్ డ్యాంకు ఇన్‌ఫ్లో భారీగా పెరగడంతో ఎన్ఎస్‌పి అధికారులు 26 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



### జాలీ ట్రిప్పులు తిరిగే లాంచీలు బంద్

నాగార్జునసాగర్ డ్యాంకు భారీగా వరద నీరు పెరగడంతో 26 గేట్ల ద్వారా నీటి దిగువకు విడుదల చేస్తున్నారు. శనివారం సెలవుదినం కావడంతో పర్యాటకులు తాకిడి ప్రారంభమైంది. నాగార్జునసాగర్ డ్యాం వరద నీరు పెరగడంతో లాంచీలు నడపవద్దని తెలంగాణ టూరిజం అధికారులకు ఎన్ఎస్‌పి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సాగర్ జలాశయానికి వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా.. ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా లాంచీలు బంద్ చేశామని, ఎన్ఎస్‌పి అధికారులు తెలిపారు. తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో నడిచే లాంచీలు బంద్ కావడంతో పర్యాటకులు అసంతృప్తికి గురయ్యారు. అయితే, ఆంధ్రప్రదేశ్ టూరిజం డిపార్ట్మెంట్ వాళ్లు లాంచీలు నడపడం విశేషం.

### నాగార్జునసాగర్ సమాచారం.

నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 588 అడుగుల వద్ద నీరు నిల్వ ఉంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టిఎంసిలు కాగా ప్రస్తుతానికి 312.5050 టిఎంసిల నీరు నిల్వ ఉంది. జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,029 క్యూసెక్కుల నీటిని కుడి కాలువ ద్వారా, 3,597 క్యూసెక్కుల నీటిని ఎడమ కాల్వ ద్వారా 8367 క్యూసెక్కుల నీటిని ఎస్ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని లోలెవల్ కెనాల్ ద్వారా విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయానికి మొత్తం ఇన్‌ఫ్లో 3,55,549 క్యూసెక్కులు కాగా రిజర్వాయర్ నుండి మొత్తం 3,55,549 క్యూసెక్కుల నీటిని 16 గేట్లు పది అడుగులు, పది గేట్లు, ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# సొంత ఊరిపై మమకారం

● రూ.66 లక్షలతో ప్రభుత్వ పాఠశాలకు అదనపు గదులను నిర్మించిన 'కల్కి' డైరెక్టర్ నాగ్ అశ్విన్
● అభినందించిన కలెక్టర్ సంతోష్, ఎంఎల్ఏ రాజేష్‌రెడ్డి



**జర్నలిస్ట్ ఫైల్**/నాగర్ కర్నూల్ ప్రతినిధి : జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా... పుట్టిన ఊరు, కన్నతల్లిని ఎప్పటికీ మరచిపోకూడదని, కన్నతల్లితో సమానమైన సొంత గ్రామంతో అనుబంధం పేగు బంధం లాంటిదని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్‌కర్నూల్ ఎంఎల్ఏ రాజేష్ రెడ్డి అన్నారు. జిల్లాలోని తాడూరు మండలం, సొంత గ్రామం ఐతోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'కల్కి' డైరెక్టర్ నాగ్ అశ్విన్ రూ.66 లక్షలతో నూతనంగా నిర్మించిన 4 అదనపు తరగతి గదులను వారు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..కల్కి సినిమాతో ప్రపంచ స్థాయిలో పేరుగాంచి ఉన్నతమైన స్థానంలో ఉంటూ సొంత గ్రామంలోని పాఠశాలకు ఆర్థిక సాయం అందించినందుకు ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్‌కు అభినందనలు తెలిపారు. పాఠశాలకు అవసరమైన మరుగుదొడ్లు మౌలిక వసతులను దాతల సహాయంతో పూర్తి చేస్తామని తెలిపారు. ఎంఎల్ఏ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే కల్కి సినిమాతో ప్రపంచ స్థాయికి ఎదిగిన నాగ్ అశ్విన్ నాగర్‌కర్నూల్ జిల్లా వాసి కావడం మనందరికీ ఎంతో గర్వించదగ్గ విషయమని అన్నారు. ప్రపంచ స్థాయికి ఎదిగినా జన్మనిచ్చిన గ్రామాన్ని మరచిపోకుండా పాఠశాలకు అవసరమైన అదనపు గదులను నిర్మించడం అభినందనీయమని అన్నారు. గ్రామ అభివృద్ధికి పాటుపడేలా కృషి చేస్తున్న డైరెక్టర్ నాగ్ అశ్విన్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానంలో వివిద హోదాల్లో ఉన్న వారందరూ ప్రభుత్వ పాఠశాలలకు, ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. తల్లిదండ్రుల కోరిక మేరకు గ్రామ పాఠశాలలో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు తన వంతుగా సహాయ సహకారాలు అందించానని తెలిపారు. గ్రామంలో గుడి, బడిని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. వచ్చే సంవత్సరం నాటికి పాఠశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని నాగ్ అశ్విన్ హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో నే తమ పిల్లలను చదివించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగ్ అశ్విని తల్లి జయంత్ రెడ్డి, తండ్రి జయరామ్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఇందుమతి, కుటుంబ సభ్యులు కృష్ణారెడ్డి, రామ్ రెడ్డి, నరసింహా రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, మండల విద్యాధికారి భాస్కర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## భలేగుంది 'వింత చేప'

కేసముద్రం మండలం కాట్రపల్లి శివారు భవాని గడ్డ తండాకు చెందిన నూనావత్ కిషన్ చేపలు పట్టేందుకు వెళ్లగా ఓ వింతైన చేప వలలో పడింది. నలుపు రంగులో తెల్లటి చారలున్న ఆ చేపను తండా వాసులు ఆసక్తిగా తిలకించారు.

## బాబు దూరదృష్టి వల్లే శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఖ్యాతి

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్:చంద్రబాబు దూరదృష్టితోనే శంషాబాద్ విమానాశ్రయానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు వచ్చిందని కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. తెలంగాణలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటును పరిశీలిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏవియేషన్ సెక్యూరిటీ కల్చర్ వీక్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చంద్రబాబు హయాంలోనే బీజం పడిందన్నారు. అప్పుడు ఇంత భూమి ఎందుకు కేటాయించారని ప్రతిపక్షాలు విమర్శలు చేశారని ఆయన గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారనిఅన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ఏవియేషన్ సెక్యూరిటీ కల్చరల్ వీక్‌లో భాగంగా 10కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## పసికందు మృతదేహంపై కుక్కల దాడి ఘోరం

మంత్రి కొండ సురేఖ ఆవేదన



**జర్నలిస్ట్ ఫైల్** /హన్మకొండ: వరంగల్ మహాత్మా గాంధీ ఆసుపత్రి ఆవరణలో పసికందుపై వీధి కు క్కల దాడి ఘటన తీవ్రంగాతనను కలచి వేసిందని రాష్ట్ర దేవదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ తెలిపారు.ఈ మేరకు శనివారం రాత్రి మంత్రి సురేఖ ప్రకటన విడుదల చేశారు. ఎం జి ఎం ఆసుపత్రి ప్రాంగణం లో ఈ ఘటన జరగడం బాధాకరమని పసికందును ఎక్కడి నుండి కుక్కలుతీసుకోవచ్చాయో సంబంధిత అధికారులు విచారించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అప్రమత్తంగా ఉంటూ ఇలాంటి సంఘటనలు జరగకుండా నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఎంజీఎం ఆసుపత్రిలో ఉపస్థితిలో ఉన్న సీసీ కెమెరాలకు అదనంగా ఆసుపత్రి చుట్టూ ప్రక్కల సిసి కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, బహిరంగ ప్రదేశాలలో వీధి కుక్కలు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ యంత్రాంగాన్ని మంత్రి సురేఖ ఆదేశించారు.

## బల్మూరికి ఓటేయొద్దు

ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్ పిలుపు

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్:తెలంగాణ లో త్వరలో యూత్ కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక జరుగనున్న నేపథ్యంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు సొంత పార్టీ లోనే చుక్కెదురయ్యింది. యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా వెంకట్ గెలవకుండా ఒక వర్గం కుట్రపన్నుతున్నారన్న విమర్శలు తలెత్తుతున్నాయి. తాజాగా రామగుండం కాంగ్రెస్ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్, బల్మూరి వెంకట్‌పై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. శనివారం రామగుండంలోని స్థానిక ఫంక్షన్ హాల్ లో కార్యకర్తలతో పెట్టిన సమావేశంలో ఆ ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో జరిగే యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఎన్నికల్లో బల్మూరి వెంకట్‌కు ఓటేయొద్దని కార్యకర్తలకు మక్కాన్ సింగ్ పిలుపునిచ్చారు. ఒక్కరికే రెండు పదవులు ఎందుకని ఆయన ప్రశ్నించారు. వెంకట్‌కు ఎమ్మెల్సీ పదవి ఉండగా యూత్ ప్రెసిడెంట్ పోస్ట్ ఎందుకని, బల్మూరికి కాకుండా ఒక సామాన్య వ్యక్తికి ఆ అవకాశం ఇవ్వాలని ఆ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

# చైర్మన్ వైస్ చైర్మన్ లను ఎన్నుకోకపోవడం తగదు.

● అధికారులను ప్రశ్నించిన నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి.



నెల్లూరు, జర్నలిస్ట్ ఫైల్ : నెల్లూరు జిల్లా, మనుబోలు మండలం పరిధిలోని అక్కంపేట గ్రామంలో ఉన్న నారపరెడ్డి సీతారామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నుకోబడిన 24 మంది సభ్యుల నుండి చైర్మన్, వైస్ చైర్మన్ లను ఎన్నుకోకపోవడం తగదని స్థానిక సీనియర్ రాజకీయ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యా కమిటీ ఎన్నిక నియమ నిబంధనల ప్రకారం 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్న తరగతుల నుండి ఇద్దరు మహిళలను, ఒకరు పురుషులను ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. నెల్లూరు నగరంలోని స్థానిక డి ఈ ఓ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారిలో ఒకరు ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవారు కాగా, ఒకరు బీసీ వర్గానికి చెందినవారు, ఒకరు జనరల్ క్యాడర్ కి చెందిన వార్లను ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇదేవిధంగా ఎన్నుకోబడిన 24 మంది కమిటీ సభ్యుల నుండి చైర్మన్ వైస్ చైర్మన్ లను ఎన్నుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అయితే గ్రామంలో నెలకొన్న రాజకీయ కోణంలో అటు రాజకీయ నాయకులతోపాటు ఇటు అధికారులు సైతం తమ హవాను ప్రదర్శించి ఎట్టకేలకు విద్య కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ ల ఎంపికను అర్ధాంతరంగా నిలిపివేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాలతో కథనాన్ని నడిపిన డిఇఓ రామారావు తానే స్వయంగా రంగంలోకి దిగకుండా మండల ఎంఈఓ ద్వారా ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఇన్చార్జి పధానోపాధ్యాయురాలు జీవ దయామణిని ఫోన్ కాల్స్ తో బెదిరింపులకు పాల్పడినట్లు స్పష్టంగా తెలుస్తుందని ఆరోపించారు. ఈ బెదిరింపులకు లొంగని పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యా కమిటీ సభ్యులు ఎంపిక కాబడిన వారు చైర్మన్ వైస్ చైర్మన్ లను కూడా ఖరారు చేయాలని పట్టుబట్టారు. దీంతో ఏమి చేయాలో తోసని స్థితిలో ఉన్న ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు దయామని స్వయంగా డీఈవో రామారావు బెదిరింపులకు పాల్పడినట్లు కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారన్నారు. ఈ విషయమై శనివారం జిల్లా విద్యాశాఖ అధికారులు కలిసి వివరణ కోరగా ఆయన విచారణ జరిపి బాధ్యులైన వారిపై తగిన చర్యలు చేపడతామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. పూర్తి నాటక సూత్రధారి అయిన డీఈవో తనకేమీ తెలియనట్లు వ్యవహరిస్తూ విచారణ చేపడతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఏదేమైనా పాఠశాల విద్యా కమిటీ సభ్యులుగా ఎన్నుకోబడిన 24 మంది నుండే చైర్మన్ వైస్ చైర్మన్ లను ఎంపిక చేయాలని డిఇఓ రామారావుకు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి చేస్తూ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేత అంబటి శ్రీనివాసులు రెడ్డి మరియు కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ జీతాలు ప్రభుత్వ ఆసుపత్రి సెక్యూరిటీ కార్మికుల పెండింగ్ జీతాల కోసం ధర్నా

ఈనెల 12 నుండి సమ్మె ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు వెల్లడి



గోకవరం,జర్నలిస్ట్‌ఫైల్ :తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి ,మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ కు మూడు నెలలుగా జీతాలు లేవని వెంటనే జీతాలు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రి గేటు వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.పెండింగ్ జీతాలు మంజూరు చేయాలని ,పిఎఫ్ అకౌంట్ ఇవ్వాలని పెరుగుతున్న ధరలకు అనుకూలంగా జీతాలు పెంచాలని తదితర నినాదాలు చేశారు. అనం తరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ ఈ రోజుల్లో ఒక్కరోజు అద్దె పెండింగ్లో ఉన్న ఇల్లు ఖాళీ చేయ మంటున్నారని అదేవిధంగా చాలీచాలని జీతాలతో బతుకు నడపడం చాలా కష్టంగా ఉందని ఇటువంటి తరుణం లో మూడు నెలలుగా జీతాలు మంజూరు చేయకపోతే ఎలా బతకాలని మధు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా జీతాలు మంజూరు చేయాలని కాంట్రాక్ట్ ను ,ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ కలిసి విజ్ఞప్తి చేస్తున్న స్పందన లేదని ఆయన పేర్కొన్నారు.ఇక తప్పని పరిస్థితుల్లో సమ్మె నోటీసు సూపరిడెంట్‌కి ఇచ్చామని 12 సోమవారం నుండి సమ్మె నిర్వహిస్తున్నామని దీనిని కి అందరు సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి నాయకులు వి కొండలరావు,యూనియన్ అధ్యక్షులు మొలగాడ ప్రసాద్ రావు, కుమార్,పెద్దబ్బాయి మోహన్,నరేష్ ,సూరిబాబు భాగ్య లక్ష్మి సుశీల అనంతలక్ష్మి, విజయలక్ష్మి, మీనాక్షి ,గంగ రత్నం వరలక్ష్మి శ్రీనువాస్,శివ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు.



విస్సన్నపేట,జర్నలిస్ట్ ఫైల్ : లలిత సూపర్ మార్కెట్ ఆవరణంలో లలిత సూపర్ మార్కెట్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం పేద వృద్ధ మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లలిత సూపర్ మార్కెట్ యాజమాన్యం మాచిన. మురళి, కోటపాటి రామకృష్ణ, మాచిన. బుడ్డియ్య, తెలుగుదేశం, జనసేన,బిజెపి నాయకులు డాబా శ్రీను,ఆకుల.రాధాకృష్ణ, మర్రిబోయిన చిన్నోడు, మురుగుల ప్రసాద్,పలగని మాధవ రావు ,మొవ్వ పండు బాబు,ఆకుల సత్యనారాయణ, షేక్ యాసిన్,తోట కిషోర్, అప్పికట్ల కుమార్, తోకల సుమ శంకర్ పిల్లి ఎలమందరావు మహిళా నాయకులు నాదెళ్ల నాగమణి, సాంబారు నాగలక్ష్మి,షేక్ హసీనా,సపరపు మౌనిక,ముప్వ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐ పవన్ కుమార్ ను కలిసిన రామసేన సభ్యులు.



గోకవరంజర్నలిస్ట్‌ఫైల్: గోకవరం సబ్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాగ వెంకట్ పవన్ కుమార్ ను విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్చం అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. రామసేన ట్రస్ట్ ద్వారా ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయనకు వివరించారు. ఆదివారం స్థానిక సూర్య ఫంక్షన్ హాల్ లో జరిగే బంగారు వరలక్ష్మి కానుక -2 లక్కీ డ్రా కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు.. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ దర్మ పరిరక్షణ రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాధరావు శర్మ, కట్టా నూకేశ్వర విజయ్ కళ్యాణ్ పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ సమావేశంలో పలు అంశాలపై గళమెత్తిన సోమిరెడ్డి.



నెల్లూరు, జర్నలిస్ట్ ఫైల్: నెల్లూరు నగరంలోని స్థానిక జిల్లా పరిషత్ సమావేశ బోనాలో జరిగిన సమావేశంలో సర్వేపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పలు అంశాలపైపలు అంశాలపై గళమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు జీలుగ విత్తనాల కొరత లేకుండా చూడాలన్నారు.ఉద్యాన శాఖ పరిధిలో వివిధ పథకాల కోసం జిల్లాలో ఖర్చు చేసిన మొత్తం గత టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే వైసీపీ ప్రభుత్వంలో భారీగా తగ్గిపోవడంపై ఆందోళనకర విషయం అన్నారు. ఉద్యాన పంటల సాగు పెరుగుతున్న నేపథ్యంలో తదనుగుణంగా పథకాలు అమలు చేయాలని సూచించారు. మనుబోలు మండలం అక్కంపేటలో ఇటీవల క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా ఇరిగేషన్ పనుల్లో తాను గుర్తించిన అక్రమాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. సుమారు రూ.1.50 కోట్ల నిధులతో నాలుగు పనులు చేసినట్టు బిల్లులు పెట్టారు. తీరా పరిశీలిస్తే ఒక్క తట్ట మట్టి తీయలేదు. కంప చెట్టు కొట్టలేదన్నారు. రైతులు సొంత నిధులతో చేసుకున్న పనులకు కూడా బిల్లులు చేసుకున్నారన్నారు.మంత్రులు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్, కలెక్టర్ వాటిని ఒక్కసారి పరిశీలించాలని కోరారు.సీఈ రిజెక్ట్ చేసిన రూ.18.70 కోట్ల విలువైన ఓ అండ్ ఎం పనులను ఎస్ఈ ఎలా ఆమోదిస్తారని ప్రశ్నించారు. రెండేళ్ల మెయింటినెన్స్ పీరియడ్ ను ఆర్నెళ్లకు తగ్గించడంలో ఆంతర్యమేమిటని అధికారులను నిలదీశారు. గత ఏడాది రెండో పంట సందర్భంగా 30 టీఎంసీల జలాలు వృథా అయిన అంశం సైతం సమావేశంలో ప్రస్తావనకు తీసుకువచ్చారు. లస్కర్లకు 20 నెలలకు పైగా జీతం ఇవ్వకపోవడం, కాలువల్లో తట్ట మట్టి ఎత్తకుండానే బిల్లులు చేసుకోవడంతోనే నీటి వృథా జరిగిందని ఆవేదన చెందారు.డేగపూడి %-% బండేపల్లి బ్రాంచ్ కెనాల్ పనుల్లో జాప్యం తగ్గదని, వెంటనే రీటెండర్ పిలిచి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు.మనుబోలు మండలం అక్కంపేటలో జగనన్న కాలనీ పేరిట దళితుల భూముల రికార్డులను మార్చి ప్రభుత్వం నుంచి కొందరు పెద్దమనుషులు రూ.93.50 లక్షలు డ్రా చేసిన వ్యవహారంపై కలెక్టర్ ప్రత్యేక విచారణ జరిపించాలన్నారు. హౌసింగ్ శాఖలో ఆప్షన్ 3 కేటగిరిలో పేదలకు ఇళ్లు కట్టకుండానే నగదు, మెటరీయల్ డ్రా చేసి కోట్లాది రూపాయలు స్వాహా చేసిన అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టి సమగ్ర విచారణ జరపాలన్నారు.వరిగొండలో గిరిజనుల కోసం కట్టిన ఇళ్ల గోడలు కాలితో తంతే పడిపోయేంత నాసిరకంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.దేవాదాయ శాఖ భూముల లీజుల్లో భారీ వ్యత్యాసంపైనా సభలో ప్రస్తావించారు.

# 13న విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం.

● విద్యా కమిటీ ఏర్పాటుకు కృషి చేస్తాం..జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు.



నెల్లూరు, జర్నలిస్ట్‌ఫైల్:అక్కంపేట ఉన్నత పాఠశాలలో జరిగిన విద్యా కమిటీ, ఎన్నిక చైర్మన్ వైస్ చైర్మన్ ల ఎంపికలో జరిగిన తప్పిదాలను తెలుసుకొని ఈ నెల 13న మంగళవారం విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని స్థానిక డీఈవో కార్యాలయంలో నెల్లూరు జిల్లా, మనుబోలు మండలం, అక్కంపేట గ్రామంలో ఉన్న నారపరెడ్డి సీతారామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఎంపిక, చైర్మన్ వైస్ చైర్మన్ ల నియామకంలో రాజకీయ, అధికారిక జోక్యం 100 ఉందని ఆరోపిస్తూ స్థానిక సీనియర్ రాజకీయ నేత, ఎన్ ఎస్ ఆర్ ట్రస్ట్ అధినేత నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి డిఇఓ రామారావుకు శనివారం విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా డిఇఓ రామారావు మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యా కమిటీలు ఎటువంటి జరిగాయన్నారు. కేవలం అక్కంపేట గ్రామంలోనే ఎందుకు ఇలా జరిగిందో తనకు తెలియడం లేదన్నారు. ఈ విషయమై స్థానిక మండల ఎంఈఓ, ఎన్నికల అధికారిగా పాల్గొన్న ఇన్చార్జి హెడ్మా స్టర్ లతోపాటు పలువురు ఎంఈఓ లను, ఉపాధ్యాయుల సమక్షంలో 24 మందితో ఎంపిక కాబడిన అక్కంపేట ఉన్నత పాఠశాల విద్యా కమిటీ సభ్యులను విచారించి, నూతన కమిటీ ఎన్నుకోవడమా లేక ఎన్నుకోబడిన 24 మంది నుండి చైర్మన్ వైస్ చైర్మన్ లను ఎన్నుకోవడమా అనే విషయాన్ని 13న మంగళవారం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టి కూడా తీసుకెళ్తామని నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డికి ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వయనాడ్ వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ విరాళాల సేకరణ..



జగ్గయ్యపేట, జర్నలిస్ట్ ఫైల్ : కేరళలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిపిఎం పార్టీ మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేరళలోని వరదల వలన ఎంతో ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని, ఇటువంటి సంఘటన జరగటం దురదృష్టక రమని బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు స్పందించి విరాళాలు అందజేసి వరద బాధితులను ఆదుకోవాలని కోరారు. కేరళలో జరిగిన విపత్తుపై కేంద్రం చూస్తూ ఊరుకోవటం దుర్మార్గమని తక్షణమే కేంద్రం స్పందించి ఈ విపత్తును జాతీయ విపత్తుగా గుర్తించి కేరళను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపిఎం పార్టీ నాయకులు కోట కృష్ణ, కాకనబోయిన లింగారావు, కాకనబయిన సుబ్బారావు, షేక్ మేరా సాహెబ్, షేక్ గౌస్ మయా, కోటా రవికుమార్, పుట్టం పుల్లారావు, షేక్ రేహమత్, షేక్ రిహాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి భాజపా కార్యకర్త ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగరవేయండి



కోదూరు, జర్నలిస్ట్ ఫైల్ : భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు ప్రతి భారతీయ జనతా పార్టీ కార్యకర్త వారి ఇంటి పైన జాతీయ జెండాను ఎగురవేయాలని భాజపా అవనిగడ్డ నియోజకవర్గ కోకన్వీనర్ తుంగల వెంకటగిరి అన్నారు శనివారం కోడూరు మండల భారతీయ జనతా పార్టీ సమావేశాన్ని ఆ పార్టీ అధ్యక్షులు వడుగు నాగబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగల వెంకటగిరి మాట్లాడుతూ అమ్మకు వందనం పేరు తో మొక్కలు నాటాలని, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగిరి వేసిన తర్వాత సెల్ఫీ ఫోటో తీసి సోషల్ మీడియాలో అప్లోడ్ చేయాలని, మండల పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించాలని కోరారు మాజీ ప్రధాని వాజ్పేయి వర్ధంతిని పురస్కరించుకుని ప్రతి మండలంలో కూడా కార్యక్రమం చేపట్టాలని, జాతీయ, రాష్ట్ర, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు ప్రతి ఒక్క కార్యకర్త క్రమశిక్షణతో పాల్గొవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి దొండపాటి శ్రీనివాసరావు, కృష్ణా జిల్లా ఆర్టిఏ కన్వీనర్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి కొండవీటి రామకృష్ణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి విశ్వనాథపల్లి వేణు, ఉపాధ్యక్షులు పేర్ని బాబురావు, దేవరకొండ సుబ్బారావు, సీనియర్ నాయకులు కోట సత్యనారాయణ, బండే ఆంజనేయులు, కొండవీటి సుబ్రహ్మణ్యం, పులిగడ్డ భాస్కరరావు, తోట రామాంజనేయులు, వంగవరపు జోషి, చిర్రావూరి అనిల్,శీలంశెట్టి కాకాని, అద్దేపల్లి శ్రీనివాసరావు,కార్యదర్శి కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు

# ముదినేపల్లి లో మానవతా సన్నాహక సమావేశం



ముదినేపల్లి, జర్నలిస్ట్ ఫైల్: ముదినేపల్లి మండలంలో మానవతా స్వచ్ఛంద సంస్థ సన్నాహక సమావేశం ముదినేపల్లి ఎస్ పి ఎ ఎమ్ కళాశాల ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కృష్ణా జిల్లా సమన్వయకర్త అడుసుమిల్లి నిర్మల అధ్యక్షతన, ఉమ్మడి కృష్ణాజిల్లా కెరీర్ గైడెన్స్ చైర్మన్ డాక్టర్ సుదాబత్తుల విజయ్ కుమార్ ఏలూరు మానవతా శాఖ కార్యదర్శి వల్లూరుపల్లి సాయి సుధా ప్రత్యేక అతిథులుగా కోనసాగింది. వక్తలు మాట్లాడుతూ మానవతా సంస్థ యొక్క ఆశయాలు విజయాలు వాటి వలన జరుగు సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ముఖ్యంగా విద్యా వైద్య ఉపాధి పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న చేయబోతున్న సేవా కార్యక్రమాలను ఉదహరించారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి ప్రముఖులు డాక్టర్ మనోజ్ ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ నిమ్మగడ్డ రవి సాక్షి సాయిబాబుదూసనపూడి దాసు, సూదా బత్తుల రమణ అడుసుమిల్లి అప్పారావు గుడివాడ గణేష్ తలారి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మండల అధికారులను మర్యాద పూర్వకంగా కలిసిన గోకవరం ప్రెస్ క్లబ్ సభ్యులు



గోకవరం, జర్నలిస్ట్ ఫైల్ : తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి ,మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ కు మూడు నెలలుగా జీతాలు లేవని వెంటనే జీతాలు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రి గేటు వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.పెండింగ్ జీతాలు మంజూరు చేయాలని ,పిఎఫ్ అకౌంట్ ఇవ్వాలని పెరుగుతున్న ధరలకు అనుకూలంగా జీతాలు పెంచాలని తదితర నినాదాలు చేశారు.అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ ఈ రోజుల్లో ఒక్కరోజు అద్దె పెండింగ్లో ఉన్న ఇల్లు ఖాళీ చేయ మంటున్నారని అదేవిధంగా చాలీచాలని జీతాలతో బతుకు నడపడం చాలా కష్టంగా ఉందని ఇటువంటి తరుణం లో మూడు నెలలుగా జీతాలు మంజూరు చేయకపోతే ఎలా బతకాలని మధు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా జీతాలు మంజూరు చేయాలని కాంట్రాక్ట్‌ను ,ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ కలిసి విజ్ఞప్తి చేస్తున్న స్పందన లేదని ఆయన పేర్కొన్నారు.ఇక తప్పని పరిస్థితుల్లో సమ్మె నోటీసు సూపరిడెంట్‌కి ఇచ్చామని 12 సోమవారం నుండి సమ్మె నిర్వహిస్తున్నామని దీనిని కి అందరు సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి నాయకులు వి కొండలరావు, యూనియన్ అధ్యక్షులు మొలగాడ ప్రసాద్ రావు,కుమార్,పెద్దబ్బాయి మోహన్, నరేష్ ,సూరిబాబు భాగ్య లక్ష్మి సుశీల అనంతలక్ష్మి, విజయలక్ష్మి,మీనాక్షి ,గంగ రత్నం వరలక్ష్మి శ్రీనువాస్,శివ పాల్గొన్నారు.

# మహిళ విలేకరులు గ్రామీణ ప్రాంతాలలో పని చేయడం ఒక సాహసమే

ఉమా మహేశ్వరి పుట్టిన రోజు వేడుకలలో సహసర విలేకరులు



గోకవరం, జర్నలిస్ట్ ఫైల్: మీడియా రంగం పట్ల మహిళలు ఆసక్తి చూపే వారి కన్నా వివిధ రంగాల్లోనే ఎక్కువ ఉంటారని కానీ అటువంటిది మీడియా రంగంపై ఆసక్తితో మన ఉమా మహేశ్వరి ఈ రంగంలోకి రావడం మనమంతా హర్షించదగ్గ విషయమని గోకవరం మండలంలో పలువురు విలేకరులు అన్నారు. శుక్రవారం నాడు విలేకరి ఉమా మహేశ్వరి పుట్టిన రోజు వేడుకలు తోటి విలేకరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మీడియా సోదరులు మాట్లాడుతూ మీడియా రంగం అనేది కత్తి మీద స్వాము లాంటిదని అందున మహిళలు ఇలాంటి రంగంలోకి రావడానికి భయపడతారని కానీ ఉమామహేశ్వరి దైర్య చేసి మీడియా రంగంలోకి అడుగుపెట్టి ఓనమాలు నేర్చు కుంటుందని తన ఉత్సాహానికి అందరూ సహకరించి మంచి ఉత్తమ జర్నలిస్ట్ గా తీర్చిదిద్దాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు జర్నలిజంలో ఉండాలని ఎందుకంటే గ్రామీణ వాతావరణానికి అనుగుణంగా మహిళలు భయ పడతారని కానీ ధైర్యంగా ముందు రావడం మంచి పరిణామం అని ప్రతి ఒక్కరు సోదరుభావంతో ఉమా మహేశ్వరి ని ప్రోత్సహించాలని అలాగే తన పుట్టినరోజు మనమందరం ఆశీర్వాదాలు తనకు నిండుగా ఉండాలని కొనియాడారు.

# ఘనంగా యుటిఎఫ్ 50వ అవిర్భావ దినోత్సవం



గుడివాడ, జర్నలిస్ట్ ఫైల్ : యుటిఎఫ్ యూనియన్ స్థాపించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ పతాకాన్ని పూర్వ జిల్లా కార్యదర్శి కె.వి సుబ్బారావు శనివారం ఆవిష్కరించారు ఈ సందర్భంగా జిల్లా గౌరవాధ్యక్షులు నీలం ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఎందరో మహానుభావులు త్యాగఫలమే ఈనాటి ఉపాధ్యాయులు అనుభవిస్తున్నటువంటి సౌకర్యాలు, త్యాగాలను గుర్తిస్తూ యుటిఎఫ్ ఆవిర్భావానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా కార్యదర్శి ఎల్.నరేంద్ర, సభ్యులు ఏవి వరలక్ష్మి, సిహెచ్ శ్రీనివాస్, వి.రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

# తృటిలో తప్పిన అగ్ని ప్రమాదం



గుడివాడ, జర్నలిస్ట్ ఫైల్ : అగ్నిమాపక సిబ్బంది స్పందనతో తప్పిన ప్రమాదం. శనివారం స్థానిక జగన్నదపురంలో దేవస్థానం వెళ్ళే రాహదారి ప్రకన ఉన్న తాటకులకు నిప్పు అంటుకోవడంతో స్థానికులు సమాచరంతో అగ్నిమాపక సిబ్బంది తక్షణమే స్పందించి, మంటలను అదుపు చేయడం వల్ల పెను ప్రమాదం తప్పింది.

## కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం గేటు - సిఎం చంద్రబాబు ఆరా



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** కర్నాటకలో తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోవడం గురించి ఎపి సిఎం చంద్రబాబు అధికారులను ఆరా తీశారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిర్వహణలో లేని పాత గేటు కొట్టుకుపోయిందని సాయిప్రసాద్ తెలిపారు. వెంటనే ప్రాజెక్టు వద్దకు డిజైన్ టీంను పంపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జలాశయంలో 6 మీటర్ల ఎత్తు వరకు నీరు ఉందని అధికారులు సిఎంకు తెలిపారు. స్టాప్‌లాక్ అరేంజ్ మెంట్ ద్వారా నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తుంగభద్ర డ్యామ్ అధికారులతో మాట్లాడాలని మంత్రి పయ్యావుల కేశవ్‌ను చంద్రబాబు ఆదేశించారు. తాత్కాలిక గేటు ఏర్పాటుపై డ్యామ్ అధికారులతో మాట్లాడాలని సూచించారు. తగిన సహకారం అందించాలని పయ్యావులకు చెప్పారు. తాత్కాలిక స్టాప్‌లాక్ గేటు ఏర్పాటుకు ఇబ్బందులున్నాయని, పాత డిజైన్ కావడం వల్ల స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉందని పయ్యావుల కేశవ్ సిఎం చంద్రబాబుకు వివరించారు.

## మంగళగిరిలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ): అనారోగ్యంతో బాధపడుతూ ముఖ్యమంత్రి సహాయనిధికి మంగళగిరి పట్టణం 15వ వార్డు చెందిన వెలగపాటి విక్టోరియా ధరఖాస్తు చేసుకోగా రూ. 50,000/- మంజూరు అయింది. ఆ చెక్కను టీడీపీ నాయకులు ఆదివారం ఇంటికి వెళ్లి అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు వెలగపాటి విక్టోరియా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పోలుమట్ల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, పట్టణ కార్యదర్శి కొదమల సురేష్, మంగళగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి వెలగపాటి విలియం, 15వ వార్డు అధ్యక్ష కార్యదర్శులు బుల్లా రాము, మాతంగి రవికిరణ్, రావూరి విజయానంద్, వడ్డేసరపు రమేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# పాపం పండింది..!



- మంగళగిరి పానకాల స్వామి ఆలయంలో అక్రమాలకు చెక్
- పానకం అమ్మకంలో అవినీతి.. దోపిడి పై మంత్రి లోకేష్ కన్నెర్ర
- పానకం, పూజా ద్రవ్యాల అమ్మకాలు రద్దు
- దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు
- ( కూరపాటి మురళి రాజు , రిపోర్టర్ , జర్నలిస్ట్ ఫైల్ )

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ) :** దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గత కొంతకాలంగా యదేచ్ఛగా పానకం విక్రయం లో జరుగుతున్న అవినీతి దోపిడీకి కాలం చెల్లింది. దేవాదాయ శాఖ నిబంధనలకు విరుద్ధంగా పానకాల స్వామి ఎగువ ఆలయంలో పానకం, పూజ ద్రవ్యాల విక్రయాన్ని కాంట్రాక్టర్ యధేచ్ఛగా ఉల్లంగిస్తుండడంతో దేవాదాయ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. శనివారం మంగళగిరి పానకాల నరసింహ స్వామి ఎగువ ఆలయంలో పానకం,పూజా ద్రవ్య విక్రయాల కాంట్రాక్ట్ రద్దు చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.

**పానకం పాటలో కొన్నేళ్లుగా ఒక్కరే..?**

పానకాల లక్ష్మీ నరసింహ స్వామి ఎగువ ఆలయములో పానకం పూజ ద్రవ్యాల విక్రయానికి మంగళగిరి కి చెందిన పాగోలు నాగలక్ష్మి అనే మహిళ రాజ్యలక్ష్మి ఎంటర్ప్రైజెస్ పేరుతో కోటి 87 లక్షల రూపాయలకు పాడుకున్నారు. గత 20 ఏళు ్లగా పానకం ద్రవ్య విక్రయాల టెండర్ కాంట్రాక్టును ఏకచత్రాధిపత్యంగా పాడుకుంటున్నారని సమాచారం. ఇందులో అధికారుల అండదండలు ఉన్నాయని ఆరోపణలు కూడా లేకపోలేదు .ఇదిలా ఉంటే దేవాదాయ శాఖ నిబంధనలు అతిక్రమించి విక్రయాలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. సదరు కాంట్రాక్టర్ రెండు లీటర్ల టోకెన్ పానకాన్ని 60 రూపాయలకు అమ్మవలసి ఉండగా 100 రూపాయలకు అమ్ముకుంటున్నారని భక్తుల ఆరోపణగా ఉంది.

పానకం అధికం ధరకు విక్రయించడం, పూజా ద్రవ్యాలు అమ్మకంలో, అలాగే ఖాళీ బాటిల్ 20 రూపాయలకు విక్రయించి ప్రతి ఏటా లక్షల రూపాయలు భక్తులు వద్ద నిలువు దోపిడీ చేస్తూ సంపాదించు కుంటున్నారని విమర్శగా ఉంది. ఇటీవల పానకం కాంట్రాక్టర్ బాటిల్ పానకాన్ని వంద రూపాయలకు విక్రయించడంతో భక్తులు ఈ విషయాన్ని మీడియాకు సమాచారం అందించారు. కొద్ది రోజుల క్రితం ఈ విషయమై కాంట్రాక్టర్ అవినీతి దోపిడీపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాలలో పానకం విక్రయ దోపిడీపై వార్తలు వచ్చాయి .దీనితో మంగళగిరి ఎమ్మెల్యే ఐటీ మరియు విద్యాశాఖమాత్యులు నారా లోకేష్ దృష్టికి రావడంతో ఆయన పానకం విక్రయములో అవినీతి దోపిడీపై దృష్టి సారించారు .తదితర పరిణామాలు అత్యంత వేగంగా చోటు చేసుకున్నాయి. దీనిపై దేవాదాయ శాఖ ఆగమేఘాల మీద వచ్చి విచారణ జరిపారని, అనంతరం శనివారం శ్రీ పానకాల స్వామి ఎగువ ఆలయంలోని పానకం పూజా ద్రవ్యాల కాంటాక్ట్ ను రద్దు చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేయడం మంగళగిరి ప్రాంతంలో ఒక్కసారిగా తీవ్ర సంచలనం కలిగించింది.

**పాపం పండింది..!** ఈ ఏడాది అక్టోబర్ వరకు టెండర్ కాంట్రాక్ట్ ఉండగా,ఖాళీ బాటిల్ 20 రూపాయలు, 60 రూపాయలు టోకెన్ పానకం ( 2 లీటర్లు) కు 100 రూపాయలు అనధికారికంగా కాంట్రాక్టర్ వసూలు చేస్తు. భక్తులను నిలువున దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టించుకోవాల్సిన గత పాలకులు, దేవాదాయ శాఖ అధికార యంత్రాంగం కొంగ జపం చేస్తూ చోద్యం చూస్తూ ఉండిపోయారు. అయితే పాపం పండింది. భక్తుల ఫిర్యాదుతో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అన్నపురెడ్డి రామకోటి రెడ్డి విచారణ చేపట్టారు. నివేదిక దేవాదాయ శాఖ కమిషనర్ కు అందచేశారు. శనివారం జారీ దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ పానకం, పూజా ద్రవ్యాలు విక్రయ టెండర్ కాంట్రాక్ట్ ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం ఆలయ ఈవో రామకోటిరెడ్డిని వివరణ కోరగా, కాంట్రాక్టర్ కాంట్రాక్ట్ రద్దు నోటీస్ తీసుకోలేదని తెలిపారు. అయితే కాంట్రాక్టర్కు సోమవారం రిజిస్టర్ నోటీసు పంపనున్నట్లు ఆలయ ఏసీ అన్నప రెడ్డి రామకోటిరెడ్డి తెలిపారు. ఏది ఏమైనా గత కొన్నేళ్లుగా పానకం విక్రయ0, లో జరుగుతున్న అవినీతిపై దేవాదాయ శాఖ ఆలస్యంగా నైనా స్పందించి సదరు కాంట్రాక్టును రద్దు చేయడం పట్ల మంగళగిరి పట్టణ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యా, వైద్యం అందిస్తే చాలు : వెంకయ్య నాయుడు




**ఉంగుటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** యువత సొంత కాళ్లపై నిలబడేలా చేయడమే అసలైన సంక్షేమం అని, విద్యా, వైద్యం అందిస్తే చాలని ఏ విధమైన ఉచితాలు అవసరం లేదని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. స్వర్ణ భారత్ ట్రస్ట్ విజయవాడ చాప్టర్ ఆత్కూరులో గుడివాడ కు చెందిన ఈ వి ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వాలు ఓట్ల కోసం, తాత్కాలిక రాజకీయ లబ్ధికోసం అవసరం లేని ఉచిత పథకాలు తీసుకువస్తున్నాయని, దీని వల్ల ప్రజలకు దీర్ఘకాలికంగా జరగవలసిన లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుంది అని అన్నారు. ఆకలితో ఉన్న వ్యక్తికి చేపలు ఇస్తే అప్పటికి సంతృప్తి చెందుతాడని, కానీ అదే వ్యక్తికి చేపలు పట్టడం నేర్పిస్తే తాను ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎన్ని కావాలంటె అన్ని చేపలు పట్టుకోగలుగతాడు అని దీని వల్ల ఎవరి మీదా ఆధారపడే అవసరం లేకుండా ప్రయోజనం పొందవచ్చు అని అన్నారు. ప్రభుత్వం యువతకు తమ కాళ్ళ పై తాము నిలబడగలిగేలా నైపుణ్యంతో కూడిన శిక్షణ ఉచితంగా అందిస్తే ఆత్మగౌరవం తో సుఖ సంతోషాలతో బ్రతుక గలుగుతారని అన్నారు. ఇదే కదా అసలైన సంక్షేమం ఇదే కదా నేటి యువత కోరుకుంటున్నది అని అన్నారు. ఇది చేయకుండా ఇప్పుడు ఉన్న సంక్షేమ పథకాలు అమలు చేసుకుంటూ పోతే ప్రజలు ఎప్పుడూ చేయి చాపి అర్థించే వారిగా మిగిలిపోతారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఈ రకమైన దృష్టి కోణంలో ఆలోచించి ప్రజలు ఆత్మగౌరవం తో జీవించేందుకు కృషి చేయాలని సూచించారు. తల్లి తండ్రులు ఆరోగ్య కర జీవనశైలిని అనుసరించడం ద్వారా పిల్లలకు అలవాటు చేయాలని సూచించారు. పాశ్చాత్య జీవనశైలి మోజులో పడి ఆరోగ్య కరమైన భారతీయ జీవన శైలిని విడనాడుతూ అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా భారతీయ సాంప్రదాయ ఆహారపు అలవాట్లను గుర్తెరిగి నడుచుకోవాలని అన్నారు. పూర్వం సూర్యోదయమే నిద్రలేవడం తో పాటు తగిన శారీరక శ్రమ ఉండేదని అందుకే పూర్వీకులు మంచి ఆరోగ్యం తో జీవించారని అన్నారు. నేడు ఆ విధమైన శ్రమ లేకుండా పోయింది అని అన్నారు అందుకే అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. కనుక గతకాలపు జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ యోగా, వ్యాయామం, ఆటలు వంటి శారీరక శ్రమ తో పాటు తాజాగా వండిన భారతీయ వంటకాలతో శరీరం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. రాత్రి పూట త్వరగా నిద్ర పోవడం వల్ల టీవీ, ఫోన్లు వాడకం నిలువరించడం ద్వారా ఆరోగ్యానికి మంచి జరుగుతుందన్నారు. అలా కాకుండా ఫోన్ టీవీ వాడకం పెరిగితే మనసులో అశాంతి అలజడి పెరుగుతుంది అని తద్వారా అనారోగ్యానికి గురవుతారు అని అన్నారు. శరీరానికి మనసు కు రెండింటి కీ పరస్పర సంబంధం ఉంటుంది అని మనసు ఆరోగ్యంగా ఉంటే శరీరం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యలు తో పిల్లలు సమయం ఎక్కువ గా గడపాలని దాని ద్వారా వారు ఎన్నో విలువైన వెలకట్టలేని జీవిత పాఠాలు నేర్పిస్తారని అన్నారు. దాని వల్ల కుటుంబ బంధాలు మరింతగా బలపడతాయని అన్నారు. స్వర్ణ భారత్ ట్రస్ట్ 23 ఏళ్ళుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, రానున్న కాలంలో మరిన్ని సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. దానికి ఉదాహరణ గా నేటి ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తోందని దీనివల్ల యువత నాలుగు మాసాలలో శిక్షణ పూర్తి చేసుకుని ఆత్మవిశ్వాసం తో తమ కాళ్ళ పై తాము నిలబడగలిగి తమ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు అని అన్నారు. స్వర్ణ భారత్ ట్రస్ట్ విజయవాడ చాప్టర్ ఆత్కూరులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉంది అని. ఈ శిబిరం లో పాల్గొని సేవలు అందించిన గుడివాడ ఈ వి ఆర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కి చెందిన గుండె, మెదడు, నరాలు, క్యాన్సర్,ఉదరకోశ వైద్య నిపుణులకు అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. వైద్య సలహాల కోసం వచ్చిన వారికి ఉచిత వైద్య పరీక్షల తో పాటు, ఉచిత భోజన సదుపాయం, వారానికి సరిపడా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వైద్యం చేయించుకున్న వారు స్వర్ణ భారత్ ట్రస్ట్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ శిబిరం లో డాక్టర్ రాజ్యలక్ష్మి ఈడుపుగంటి, డాక్టర్ రాజేంద్ర క్రాంతి, డాక్టర్ రేవంత్ కుమార్, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ అమృత కొండపల్లి, డాక్టర్ రఘురాం మన్నెం, డాక్టర్ సుమన్ కుమార్, డాక్టర్ జయశ్రీ సూరపనేని, డాక్టర్ గౌతమి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ నీలిమా, డాక్టర్ అనూషా తదితరులు పాల్గొని వైద్యసేవలు అందించారు.

# ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి పదవి కోసం పోటాపోటీ!

- రేసులో నలుగురు రాజ్యసభ మాజీ సభ్యులు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నామినేటెడ్ పదవులపై ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు ప్రారంభించిన నేపథ్యంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవి కోసం నలుగురు రాజ్యసభ మాజీ సభ్యుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. కంభంపాటి రామ్మోహనరావు, గల్లా జయదేవ్, రఘురామ కృష్ణరాజు, సుజనా చౌదరి.. ఆ పదవిని ఆశిస్తుండటంతో పాటు తమకు ఇస్తే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ఒనగూరే ప్రయోజ నాల గురించి, తమ గుణగణాలపైనా చంద్రబాబు ముందు, వారి సన్నిహితుల వద్ద ఏకరువు పెట్టినట్లు సమాచారం. బిజెపి ఎంఎల్‌ఏగా ఉన్న సుజనా చౌదరి ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి పదవిని కోరడం కూటమి పార్టీల్లో హాట్ టాపిక్‌గా మారింది. కాగా చంద్రబాబు మాత్రం కంభంపాటి వైపు మొగ్గు చూపుతున్నారని టిడిపి వర్గాలు గుసగుసలాడుతు న్నాయి. తాను గతంలో టిడిపి నుంచి రాజ్యసభ సభ్యునిగా ఉండి మోడీ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పని చేశానని, ఆ అనుభవంతోపాటు, బిజెపి అగ్ర నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సుజనా చౌదరి వాదిస్తున్నారు. టిడిపి-జనసేన-బిజెపి కూటమిలో నామినేటెడ్ పదవులను 60, 30,10 నిష్పత్తిలో పంపిణీ జరగాలని ప్రాథమికంగా మూడు పార్టీల మధ్య అవగాహన కుదిరినందున, ఢిల్లీ ప్రతినిధి పోస్టును తనకు ఇవ్వాలని పట్టుబడుతు న్నారని చర్చ సాగుతోంది. రెండు సార్లు గుంటూరు ఎంపిగా పని చేసి, జగన్ ప్రభుత్వం వేధింపులతో వ్యాపారపరంగా నష్టపోయి, ఎన్నికల్లో ఎంపి సీటును త్యాగం చేసిన తనకు ఢిల్లీ ప్రతినిధి పదవి ఇవ్వాలని గల్లా జయదేవ్ అంటున్నారు. ఎంపిగా చేసిన తనకు ఢిల్లీలో బిజెపి నేతలతో సత్సంబంధాలున్నాయని, ఒక విధంగా బిజెపి-టిడిపి పొత్తుకు ఢిల్లీలో కృషి చేశానని, జగన్ ప్రభుత్వ కక్ష సాధింపులను ఎదుర్కొన్నానని, ఎంపి సీటును వదలుకొని ఎంఎల్‌ఎ అయ్యానని, అందుకే తనకు ఢిల్లీ ప్రతినిధిగా నియ మించడం న్యాయమని రఘురామ చెబుతున్నారు. ఇక గతంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా పని చేసిన అనుభవం తనకే ఉందని, బిజెపితో పాటు కాంగ్రెస్, ఇతర అన్ని రాజకీయ పార్టీల నేతలతో సంబంధాలున్నాయని, గతంలో నియమితులైన పార్టీ రాజ్యసభ సభ్యుల్లో తానే అత్యంత సీనియర్‌నని, అందుకే తనకు పదవి ఇవ్వాలని కంభంపాటి కోరుతు న్నారు. చంద్రబాబు మాత్రం ఈ పదవిపై ఆచితూచి అడుగు లేస్తున్నారు. ఢిల్లీలో బిజెపి ప్రభుత్వంలో అన్ని కార్యాలూ చాక చక్యంగా చక్కబెట్టే వారి కోసం అన్వేషిస్తున్నారు. చివరికి ఎవరి వైపు మొగ్గు చూపుతా రోనని కూటమి పార్టీలు ఆసక్తిగా ఉన్నాయి. ఇదిలా ఉండగా ఢిల్లీ ప్రతినిధి పదవి కోసం రేస్‌లో ఉన్న నలుగురూ స్వతహాగా బడా వ్యాపారులు కావడం గమనార్హం. కేబినెట్ ర్యాంక్‌తో పాటు అత్యంతక కీలక పదవి కావడంతో పోటీ తీవ్రంగా ఉంది.

# 16 నుంచి రెవెన్యూ సదస్సులు




- 15న లాంఛనంగా ప్రారంభం
- షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో నమోదు

**అమరావతి బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వ్యాప్తంగా 22(ఎ)భూముల యాజమాన్య హక్కులను నిర్ధారించేందుకు ఈ నెల 16వ తేదీ నుంచి అన్ని జిల్లాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సదస్సులను స్వాతంత్ర్య దినోత్సవం రోజున (15వ తేదీన) మంత్రులు, ఎంఎల్‌ఎలు లాంఛనంగా ప్రారంభిస్తారని పేర్కొంది. ఈ మేరకు రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌ను శనివారం విడుదల చేసింది. జిల్లాలో ఏ రోజు ఏ రెవెన్యూ గ్రామంలో సదస్సు నిర్వహించాలనే విషయాన్ని 13వ తేదీనాటికి పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఏమేర అన్యాక్రాంతమయ్యాయి? అందుకు బాధ్యులైన అధికారులెవరు? అనే అంశాలను ఈ సభల్లో తొలుత గుర్తించనున్నారు. రెగ్యులర్ సదస్సులు ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 30 వరకు (45 రోజులు) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. మండల స్థాయిలో వచ్చే ఫిర్యాదులను ఎక్కడికక్కడ పరిష్కరించడంతో పాటు, వాస్తవ పరిస్థితిని, ఫిర్యాదులను ఆర్‌టిజిఎస్ ప్రత్యేకంగా తయారు చేసిన యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.

**సదస్సుల నిర్వహణకు నిధులు**

సదస్సుల నిర్వహణ కోసం ప్రభుత్వం ఒక్కో జిల్లాకు రూ. 8 లక్షల నుంచి రూ. 10 లక్షలు బడ్జెట్ కేటాయించింది. సదస్సుల నిర్వహణ సీనియర్ ఐఎఎస్ అధికారి (డిస్ట్రిక్ట్ స్పెషల్ ఆఫీసరు) పర్యవేక్షణలో నిర్వహించాల్సి ఉంటుంది. మండల స్థాయిలో తహశీల్దార్‌తో పాటు ఆర్ఐ, విఆర్ఒ, మండల సర్వేయరు, దేవాదాయశాఖ, వక్ఫ్ బోర్డు నుంచి ప్రతినిధి, రిజిస్ట్రేషన్‌శాఖ నుంచి ఉద్యోగి, అవసరమైన చోట అటవీశాఖ నుంచి ఉద్యోగి సదస్సుల నిర్వహణలో పాల్గొంటారు. జిల్లా స్థాయిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మానిటరింగ్ చేయాల్సి ఉండగా, మండల స్థాయిలో డివిజన్ స్థాయి అధికారి ఆర్‌డిఒ నోడల్ ఆఫీసరుగా వ్యవహరించనున్నారు. రైతుల నుంచి తీసుకున్న ప్రతి అర్జీకి ఎకనాలెడ్జ్‌మెంట్ ఇవ్వాల్సి ఉంటుంది. పెద్ద రెవెన్యూ గ్రామమైతే రోజంతా, చిన్న గ్రామమైతే అరపూట సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం పేర్కొంది. గ్రామాల్లో రైతులకు సదస్సులపై అవగాహన కల్పించేందుకు కరపత్రాల పంపిణీ చేయడంతోపాటు సదస్సుల షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను గ్రామ పంచాయతీ, పిఎసిఎస్, కూడళ్లలో డిస్‌ప్లే చేయాల్సి ఉంటుంది.

# బాలలపై లైంగిక వేధింపులు పెరిగాయి

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** దేశంలో లైంగిక వేధింపులకు గురైన బాలల సంఖ్య పెరిగిందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆందోళన వ్యక్తం చేశారు. విభిన్న ప్రతిభావంతులు, బాలల హక్కుల పరిరక్షణపై గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్. శంకరన్ హాల్లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు (జువెనైల్ జస్టిస్ కమిటీ) ఆధ్వర్యంలో జరిగిన వార్షిక రాష్ట్ర స్థాయి భాగస్వాముల సదస్సును ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) 2023 రికార్డుల ప్రకారం దేశ వ్యాప్తంగా 1.62 లక్షల మంది బాలలపై నేరాలు జరిగాయని, 83,350 మంది బాలలు మిస్ అయినట్లు కేసులు నమోదయ్యాయని తెలిపారు. కిడ్నాపింగ్, బలవంతపు నేరాలు 45 శాతం ఉన్నాయని వివరించారు. దేశంలో లైంగిక వేధింపులకు గురైన బాలల సంఖ్య 2021 సంవత్సరం కంటే 2022లో పెరిగిందని తెలిపారు. రాకెట్ సైన్స్ నేర్చుకుంటోన్న ఈ రోజుల్లో కూడా బాలలపై దాడులు ఎక్కువ జరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. చట్టంతో విభేదించిన బాలల సంఖ్య చాలా తక్కువగా ఉందని, కానీ రక్షణ, సంరక్షణ అవసరమైన బాలల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని తెలిపారు. బాలలపై నేరాలకు పాల్పడిన వారికి పోక్సో చట్టం కింద కఠినమైన శిక్షలు వేస్తున్నా, నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్‌సిఆర్‌బి రికార్డుల ప్రకారం లైంగిక దాడులు జరిగిన 1,004 కేసుల్లో 900 కేసులు తెలిసిన వారి వల్ల జరిగినవే వివరించారు. బాలలు బలహీనులు, ఏమి చేయలేరు, ఎవరికీ చెప్పుకోలేరు అని అనుకొని వారిపై లైంగిక నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. బాలలపై నేరాలకు పాల్పడిన వారికి పోక్సో, జువైనల్ జస్టిస్ చట్టాలు, లీగల్ ప్రొవిజన్స్ ప్రకారం అమలు చేసే కఠిన చట్టాలపై పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సదస్సులో జువైనల్ జస్టిస్ కమిటీ చైర్‌పర్సన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. నరేందర్, జువైనల్ జస్టిస్ కమిటీ సభ్యులు డాక్టర్ జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్, జస్టిస్ కిరణ్మయి మండవా, జస్టిస్ వెంకటజోతిర్మయి ప్రతాప, జస్టిస్ వి. సుజాత, తిరుపతి జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు సంధ్యారాణి, ఎపి లీగల్ సెల్ అథారిటీ మెంబరు సెక్రటరీ ఎ. భవిత, జిల్లా జడ్జి వైవిఎస్. బి.జి. పార్థసారథి, వివిధ శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కొత్తగా పెళ్లైన వారికి రేషన్ కార్డులు!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. మ్యారేజ్ సర్టిఫికెట్ ఆధారంగా వీటిని జారీ చేసే విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ విషయంపై మంత్రి నాదెండ్ల మనోహర్ క్లారిటీ ఇచ్చారు. కొత్త జంటలు రేషన్ కార్డు కోసం చాలా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తాము గుర్తించామని పేర్కొన్నారు. వివాహం చేసుకుని రేషన్ కార్డులో పేర్లు లేని వారిని గుర్తించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఓ సర్వేను చేపడతామని అన్నారు. వారి అర్హతలను పరిశీలించి ఖచ్చితంగా వారికి కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తామని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 1.48 కోట్ల రేషన్ కార్డులు ఉన్నాయి. అందులో 89 లక్షల రేషన్ కార్డులకు ఆహార భద్రత చట్టం కింద కేంద్రం నిత్యావసరాలు అందజేస్తోంది.

# అమరావతిలో ప్రపంచబ్యాంకు బృందం



- సిఆర్‌డిఎలో సమీక్ష, నిర్మాణాల పరిశీలన
- రాజధాని రుణ ప్రతిపాదనపై చర్చ
- రు15వేలు కోట్లు కోరిన ప్రభుత్వం

**అమరావతి బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం శనివారం అమరావతిలో పర్యటించింది. తొలుత సిఆర్‌డిఎ కార్యాలయంలో అధికారులతో సమీక్షించిన అనంతరం రాజధాని పరిధిలో కట్టడాలు, ఇతర నిర్మాణాలు, ప్రస్తుత స్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నలుగురు ఉన్నతాధికారులు, ఎనిమిది మంది సహాయకులు ఈ బృందంలో ఉన్నారు. ఉదయం సిఆర్‌డిఎ కార్యాలయానికి చేరుకున్న బ్యాంకు బృందం రాజధాని నిర్మాణ రుణ ప్రతిపాదనల గురించి చర్చించినట్లు సమాచారం. రాజధాని అమరావతికి ఎటువంటి సహాయం కావాలి, ఏ పద్ధతుల్లో తీరుస్తారు అనే అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

కనీసం రు. 15 వేల కోట్లరూపాయలు రుణంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనపై నేడు మళ్లీ ప్రపంచబ్యాంకు బృంద సభ్యులు అధికారులతో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో అమరావతి సస్టయినబల్ క్యాపిటల్ సిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఎ-ఎస్‌సిసిడిపి)కు సంబంధించిన అంశాలను అధికారులు ప్రపంచబ్యాంకు ప్రతినిధుల ముందుంచినట్లు తెలిసింది. దీనిపై 2016లో ప్రపంచ బ్యాంకుకు రూపొందించిన ప్రాజెక్టు నివేదిక(పి159808)కు సంబంధించిన అంశమూ చర్చకు వచ్చింది. అప్పట్లో ప్రతిపాదించిన లెక్కలను కొంత సవరించినట్లు సమాచారం.

**ఇదీ ప్రభుత్వ ప్రతిపాదన**

విశ్వసనీయ సమాచారం ప్రకారం 2050 నాటికి అమరావతి నగరంలో 3.5 మిలియన్ ప్రజలు ఉంటారని, వారికి కావాల్సిన అన్ని రకాల సదుపాయాలు కల్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. 20 శాతం ఏరియాను గ్రీన్, బ్లూ ఏరియాగా మారుస్తామని, నగరంలో ఉండే ప్రతిపౌరుడూ నేరుగా కాలినడక దూరంలో పార్కును చేరుకునేలా ప్లాన్ చేశామని పేర్కొన్నారు. ముఖ్యంగా రోడ్లు, యుటిలిటీ కారిడార్లు, గ్రామీణ సదుపాయాల మెరుగుదల (మంచినీరు, సీవరేజీ, విలేజ్‌రోడ్లు, కనెక్టివిటీ, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) వరద ముంపు నివారణ కాలువల మెరుగుదల చేసేందుకు అవసరమైన నిధులు రుణంగా ఇవ్వాలని ప్రపంచబ్యాంకు ప్రతినిధులను కోరారు. దీనికోసం కనీసం రూ. 40 వేల కోట్ల అవసరం ఉందని, తాత్కాలికంగా రూ. 15 వేల కోట్లు ఏర్పాటు చేస్తే వెసలుబాటుగా ఉంటుందని పేర్కొన్నట్లు తెలిసింది. సుదీర్ఘ చర్చ అనంతరం ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు క్యాపిటల్ సిటీ ఏరియాను పరిశీలించాలని కోరగా సిఆర్‌డిఎ అధికారులు తీసుకెళ్లారు.

రాయపూడిలో భవనాలు, హైకోర్టు పరిసరాలు, నిలిచిపోయిన నిర్మాణాలను ప్రతినిధి బృందానికి చూపించారు. గతంలో పర్యావరణ ప్రభావం (ఇఐఎ), పర్యావరణ సామాజిక నిర్వహణ ఫ్రేమ్‌వర్కు (ఇఎస్‌ఎంఎఫ్) కూడా పూర్తి చేసినందున ఇప్పుడు కొత్తగా చేయాల్సిన అవసరం ఉండకపోవచ్చని అధికారులు చెప్పినట్లు తెలిసింది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467